


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | శుక్రవారం 8-1-2021 | RNI No.52865/93 Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 135 | పేజీలు: 4 | వెల: రూ.1/-

# హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా హిమాకోహ్లీ ప్రమాణం



తెలంగాణ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రాజ్‌భవన్‌లో ప్రమాణం చేసిన అనంతరం సంతకం చేస్తున్న జస్టిస్ హిమా కోహ్లీ

### హాజరైన సిఎం కెసిఆర్..పలువురు మంత్రులు,జడ్జిలు
### తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా కోహ్లి రికార్డు
### రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్ తమిళసై



తెలంగాణ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రాజ్‌భవన్‌లో ప్రమాణం చేసిన జస్టిస్ హిమా కోహ్లీని అభినందించిన సిఎం కెసిఆర్

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ హిమా కోహ్లీ ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జస్టిస్ హిమా కోహ్లీ చేత గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరు కాగా, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు హాజరయ్యారు. ప్రమాణస్వీకార కార్యక్రమం ముగిసిన అనంతరం జస్టిస్ హిమా కోహ్లీకి గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి కేసీఆర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జస్టిస్ హిమ కోహ్లీ తెలంగాణ హైకోర్టుకు మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా నిలిచారు. 1959 సెప్టెంబర్‌లో ఢిల్లీలో పుట్టిన జస్టిస్ హిమ కోహ్లీ 1979లో సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుంచి బీఏ ఆనర్స్ హిస్టరీలో పట్టభద్రులయ్యారు. తరువాత ఢిల్లీ యూనివర్సిటీ క్యాంపస్ లా సెంటర్ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1984లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో సభ్యురాలిగా నమోదై.. న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 2006 మేలో ఢిల్లీ హైకోర్టులోనే అదనపు జడ్జిగా నియమితులయ్యారు. సుమారు 15 నెలల తరువాత పూర్తిస్థాయి జడ్జిగా బాధ్యతలు స్వీకరించారు. కొవిడ్-19 విస్తరణ నేపథ్యంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని జైళ్లలో రద్దీని తగ్గించేందుకు సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన ఉన్నతస్థాయి కమిటీకి హిమ కోహ్లీ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు.

ఇప్పటి వరకు సీజేగా ఉన్న జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ బదిలీపై ఉత్తరాఖండ్ హైకోర్టు సీజేగా వెళ్లిన విషయం తెలిసిందే. ఆ స్థానంలో పదోన్నతిపై జస్టిస్ హిమా కోహ్లీ బాధ్యతలు చేపట్టారు.

# అమెరికాలో ట్రెంపరితనం

### అధికార మార్పిడికి అడ్డంకిగా ట్రంప్ చర్యలు
### క్యాపిటల్ భవనంపై ట్రంప్ మద్దతుదారుల దాడి
### పోలీసుల కాల్పుల్లో నలుగురు మృతి
### దాడికి కారుకులను గుర్తించే పనిలో పోలీసులు
### ట్రంప్ తీరును ఖండించిన ప్రపంచదేశాలు
### ఇది తగని చర్య అన్న కాబోయే అధ్యక్షుడు జో బైడెన్
### ట్రంప్‌ను అధ్యక్షపదవి నుంచి తొలగించే పనిలో ఉపాధ్యక్షుడు?

వాషింగ్టన్,జనవరి7(ఆర్ఎన్ఎ): క్యాపిటల్ భవనంపై డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారుల దాడి నేపథ్యంలో అమెరికాలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అధికారాన్ని వదులుకునేందుకు సిద్ధంగా లేని ట్రంప్ ఏదో రకంగా అలజడి సృష్టించే కార్యక్రమాలకు ప్లాన్ చేస్తున్న తరుణంలో తాజా దాడి దీనికి నిదర్శనంగా చూడాలి. మరో పది రోజుల్లో వైట్ హౌజ్ వదలాల్సి ఉన్న సమయంలో ఆయన మద్దతుదారులు అనూహ్యంగా దాడికి తెగబడ్డారు. ఈ ఘటనతో ట్రంప్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధ్యక్ష ఎన్నికల ఫలితాన్ని తారుమారుచేసేలా ఆయన వ్యవహరిస్తున్న తీరును సొంతపార్టీ నేతలతో పాటు ప్రపంచ దేశాధినేతలు ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా అధికార మార్పిడి జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేసారు. అగ్రరాజ్య 46వ అధ్యక్షుడిగా డెమొక్రాట్ జో బైడెన్ గెలుపును ధ్రువీకరించే సమావేశాన్ని అడ్డుకునేందుకు ట్రంప్ మద్దతుదారులు క్యాపిటల్ భవనాన్ని ముట్టడించి గందరగోళం

సృష్టించారు. ఈ సందర్భంగా కాల్పులు కూడా జరిగాయి. ఈ క్రమంలో వాషింగ్టన్ డీసీలో తీవ్రస్థాయిలో ఉద్రిక్తతలు చెలరేగాయి. ఆందోళనలను అణచివేసే క్రమంలో జరిపిన కాల్పుల్లో నలుగురు వ్యక్తులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యవహారశైలి కారణంగానే ఈ దుస్థితి వచ్చిందని, అధ్యక్ష పదవి నుంచి ఆయనను తొలగించేందుకు కేబినెట్ నిర్ణయించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అమెరికా రాజ్యాంగంలోని 25వ సవరణ ప్రకారం ట్రంప్‌ను పదవీచ్యుతుడిని



చేసేందుకు ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ సహా మంత్రిమండలి సిద్ధమైనట్లు అమెరికా మీడియా పేర్కొంది. ఇందుకు సంబంధించి చర్చ జరుగుతోందని, విచక్షణ కోల్పోయి ఆందోళనకు కారణమైన ట్రంప్ ఏ క్షణంలోనైనా పదవి నుంచి దిగిపోవాల్సి వస్తుందని రిపబ్లికన్ నాయకులు అన్నట్లు సీఎన్ఎన్ కథనం వెలువరించింది. 5వ రాజ్యాంగ సవరణ ప్రకారం.. అధ్యక్షుడు మరణించడం లేదా అభిశంసనకు గురికావడం లేదా రాజీనామా చేయడం, తన బాధ్యతలు సక్రమంగా నిర్వహించని పక్షంలో ఉపాధ్యక్షుడు ప్రెసిడెంట్‌గా వ్యవహరించే అవకాశం ఉంటుంది. ఇక అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తారుమారు చేయాలన్న ట్రంప్ తీరును వ్యతిరేకిస్తున్న వైస్ ప్రెసిడెంట్ మైక్ పెన్స్.. హింస ఎన్నటికీ గెలవదు అంటూ బైడెన్ ఎన్నికను ధ్రువపరిచే సమావేశాన్ని కొనసాగించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఒకవేళ కేబినెట్ నిజంగానే ట్రంప్‌ను గద్దెదించేందుకు నిర్ణయిస్తే పెన్స్ ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా.. మరో 14 రోజుల పాటు ట్రంప్ పదవిలో ఉంటే.. ప్రతీ క్షణం అధికార దుర్వినియోగం చేసేందుకు ప్రయత్నిస్తారు. ప్రజలు, జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా ఆయనను వెంటనే తొలగించండి అంటూ డెమొక్రాట్లు డిమాండ్ చేసారు. ఇక.. అన్నివైపుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతుండటంతో ట్రంప్ రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. కాగా జనవరి 20 బైడెన్ పదవీ స్వీకార ప్రమాణానికి అధికారులు ఇప్పటికే సర్వం సిద్ధం చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన జోబైడెన్ గెలుపును ధ్రువీకరించేందుకు యూఎస్ కాంగ్రెస్ సమావేశం కావడంతో ట్రంప్ మద్దతుదారులు రెచ్చిపోయారు. బైడెన్ ఎన్నికను వ్యతిరేకిస్తూ ట్రంప్ మద్దతుదారులు నినాదాలు చేపట్టారు. అమెరికా క్యాపిటల్ హిల్ బిల్డింగ్‌లో జరిగిన హింసలో నలుగురు చనిపోయారు. ఆందోళన నేపథ్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. 50 మందికిపైగా అరెస్ట్ చేశారు. ట్రంప్ అభిమానులంతా క్యాపిటల్ హిల్‌పై దాడి చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆ సమయంలో జరిగిన హింసలో క్యాపిటల్ గ్రౌండ్‌లోనే సుమారు 26 మందిని అదుపులోకి తీసుకున్నారు. పలువురి నుంచి లైసెన్సు లేని నిషేధిత ఆయుధాలతోపాటు రిపబ్లికన్, డెమోక్రటిక్ నేషనల్ కమిటీ హెడ్‌క్వార్టర్ల వద్ద రెండు పైప్ బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇక క్యాపిటల్ పోలీసు ఆఫీసర్ జరిపిన ఫైరింగ్‌లో ఓ మహిళ మృతి చెందింది. ఇక మరో ముగ్గురు మెడికల్ ఎమర్జెన్సీ కారణాల వల్ల మృతిచెందారు. ఈ ఘటనలో 14 మంది పోలీసులు గాయపడ్డారు. క్యాపిటల్ హిల్ ఘటనలో అరెస్టుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ట్రంప్ అభిమానుల్ని తరిమేందుకు ఫెడరల్ ఏజెంట్లు టియర్ గ్యాస్‌ను వినియోగించారు. అసలు ట్రంప్ అభిమానులు ఎలా క్యాపిటల్ హిల్‌లోకి వచ్చారు, ఎలా వాళ్లంతా బయటకు స్వేచ్ఛగా వెళ్లిపోయారనే దానిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు హింసకు దిగిన వారిని గుర్తించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. సోషల్ మీడియాల్లో పోస్టు అయిన వీడియోలు, ఫోటోల ఆధారంగా నిందితులను గుర్తించే పనిలోపడ్డారు. ఇదిలా ఉంటే రెండు వారాల పాటు వాషింగ్టన్‌లో కర్ఫ్యూ విధించారు. నగరంలో ప్రజల కదలికలపై పోలీసులు గట్టి నిఘా పెట్టారు. ఈ ఘటనను అమెరికాకు కాబోయే అధ్యక్షుడు జో బైడెన్ ఖండించారు. ప్రపంచ దేశాల అధినేతలు, ప్రధాని నరేంద్రమోదీ తీవ్రంగా ఖండించారు. అమెరికా సమాజంలో, రిపబ్లికన్ పార్టీలో కనీవినీ ఎరుగని విభజన. అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేని ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. విజేత జో బైడెన్‌కు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నారు. 306-232 ఓట్ల తేడాతో గెలిచిన డెమోక్రటిక్ అభ్యర్థి బైడెన్‌ను ఎలక్టోరల్ కాలేజీ ఓటర్లు గురువారం లాంఛనంగా ఎన్నుకోవలసి ఉంది. ఇందుకోసం అమెరికా కాంగ్రెస్ ఉభయ సభలు.. ప్రతినిధుల సభ, సెనేట్ సంయుక్తంగా సమావేశం కానున్నాయి. ఈ ఎన్నికను అడ్డుకోవాలని ట్రంప్ ఇచ్చిన పిలుపు మేరకు దేశం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో మద్దతుదారులు రాజధాని వాషింగ్టన్‌కు తరలివచ్చారు. వైట్‌హౌస్‌కు కూతవేటు దూరంలోని ఫ్రీడమ్ ప్లాజాలో బైఠాయించారు. గడ్డకట్టే చలిలో.. నిరంతరం వర్షం కురుస్తున్నా అక్కడి నుంచి కదలడం లేదు. ఓటింగ్, లెక్కింపులో అక్రమాలు జరిగాయని.. అక్కడ ఎన్నిక రద్దుచేసి మళ్లీ జరిపించాలంటూ ట్రంప్ బృందం కోర్టులకు వెళ్లినా చుక్కెదురైంది. న్యాయపరమైన దారులు మూసుకుపోవడంతో.. ఇక ఆయనకు మిగిలిన ప్రత్యామ్నాయమేమిటో మద్దతుదారులకు కూడా అంతు పట్టడం లేదు. 'అధ్యక్ష ఎన్నికల్లో అవినీతి, అక్రమాలు, మోసం జరిగాయని రాష్ట్రాలకు తెలుసు. తమ ఓట్లను సరిదిద్దాలని అవి భావిస్తున్నాయి. పెన్స్ చేయాల్సిందలా.. ఆ ఓట్లను వెనక్కి పంపడమే. అలా చేస్తే మనదే విజయం. మైక్.. ఈ పని నువ్వు చేయాలి. అత్యంత తెగువ చూపాల్సిన సమయమిది' అని ట్రంప్ ట్వీట్ చేశారు. తాను చెప్పినట్లు చేయకపోతే పెన్స్ రాజకీయంగా దెబ్బతింటారంటూ ట్రంప్ ఒత్తిడి తెస్తున్నారని న్యూయార్క్ టైమ్స్ పత్రిక తెలిపింది. అధ్యక్షుడి సూచనను పెన్స్ తిరస్కరించారని పేర్కొంది. కాగా అలీపే, వుయ్‌చాట్ పే సహా ఇంకో 8 చైనీస్ యాప్‌లపై అమెరికా నిషేధం విధించింది. అమెరికా ప్రయోజనాల పరిరక్షణకు వాటి లావాదేవీలను నిలువరించే కార్యనిర్వాహక ఆదేశాలపై అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశారు.




### చరిత్రలో నేటినిజం



కం॥ ఆశావాదము వాడని
రాశా వాదము ను గొల్పు అతిబలయుగటునే
"ఆశా పూర్ణా దేవి"కి
రాశీకొలది విజయమునకు ప్రణాములనిడెదన్!!

జనవరి 8 జ్ఞానపీఠ పురస్కార గ్రహీత బెంగాలీ రచయిత్రి ఆశాపూర్ణాదేవి జయంతి..



-రాధశ్రీ

సెల్: 9494481210

# ఢిల్లీలో రైతుల ఆందోళన మరింత ఉధృతం

### ట్రాక్టర్లతో ర్యాలీ తీసిన రైతులు

న్యూఢిల్లీ,జనవరి7(ఆర్ఎన్ఎ): వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా,రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా వేలాది మంది రైతులు సింఘు తిక్రి, ఘాజీపూర్ సరిహద్దుల్లో గురువారం ట్రాక్టర్ మార్చ్ నిర్వహించారు. సుమారు 3500పైగా ట్రాక్టర్లతో పెద్ద ఎత్తున ర్యాలీ తీస్తున్నట్లు భారతి కిసాన్ యూనియన్ (ఏక్తా ఉగ్రహాన్) చీఫ్ జోగిందర్ సింగ్ ఉగ్రహాన్ తెలిపారు. జనవరి 26న నిర్వహించే పరేడ్‌లో భాగంగా సన్నాహకంగా ర్యాలీ తీసినట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటల సమయంలో ట్రాక్టర్ మార్చ్ ప్రారంభమైంది. కుండ్లి, మనేసర్ పాల్వాల్ ఎక్స్‌ప్రెస్ హైవేపై సాగింది. ర్యాలీ నేపథ్యంలో ఢిల్లీ, హర్యానా సరిహద్దుల్లో పోలీస్ సిబ్బంది భారీగా మోహరించారు. తమ డిమాండ్లను అంగీకరించకపోతే నిరసన మరింత తీవ్రతరం చేస్తామని కిసాన్ మోర్చా సంయుక్త్ కిసాన్ మోర్చా సీనియర్ సభ్యుడు అభిమన్యు కోహన్ పేర్కొన్నారు. తీవ్రమైన చలి, వర్షాలు కురుస్తున్నా పట్టువీడకుండా రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో 40 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర, చట్టపరమైన హామీ ఇవ్వాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. కేంద్ర మంత్రులతో సోమవారం జరిగిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. ఇరువర్గాల మధ్య శుక్రవారం మరోసారి చర్చలు జరుగనున్నాయి.

# బైకును ఢీకొన్న బస్సు: యువకుడు మృతి

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): బైకును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటనలో ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన హైదరాబాద్ చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపేట విక్టోరియా మెమోరియల్ మెట్రోస్టేషన్ డిపోడి వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ యువకుడిని నార్కట్‌పల్లి డిపోకు చెందిన బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న యువకుడు కిందపడి అక్కడికక్కడే మరణించాడు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా శ్రీకాంత్‌గా గుర్తించారు. అయితే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతర కృషి

### అభివృద్ధికి దోహదకారిగా ఫ్రైట్ కారిడార్లు
### వర్చువల్ విధానంలో ప్రారంభించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జనవరి7(ఆర్ఎన్ఎ): మన దేశంలో వివిధ ప్రాంతాల్లో నూతన అభివృద్ధి కేంద్రాలు వృద్ధి చెందడానికి ఈస్టర్న్, వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు దోహదపడతాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. దేశాభివృద్ధిలో ఇవి పెను మార్పులు తీసుకొస్తాయన్నారు.

మన దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం మనం చేస్తున్న నిరంతర కృషి నేడు నూతన వేగాన్ని అందుకుందని చెప్పారు.

మేవారి-మాడార్ వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌ను మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. దీంతో ఈస్టర్న్, వెస్టర్న్ డెడికేటెడ్ కారిడార్ల మధ్య నిరంతరాయ అనుసంధానం సాధ్యమైంది. న్యూ అటేలీ-న్యూ కిషన్‌గఢ్ మార్గంలో డబుల్ స్టాక్ లాంగ్ హౌల్ కంటెయినర్ ట్రైన్‌ను కూడా ప్రారంభించారు. రేవారి-మాడార్ వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ 306 కిలోమీటర్ల పొడవున ఉంది. కంటెయినర్ ట్రైన్ పొడవు 1.5 కిలోమీటర్లు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, ఈస్టర్న్, వెస్టర్న్ డెడికేటెడ్ కారిడార్లు భారత దేశానికి గేమ్ ఛేంజర్స్ అని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో నూతన అభివృద్ధి కేంద్రాలు వృద్ధి చెందడానికి ఇవి దోహదపడతాయని చెప్పారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో అభివృద్ధి వనరులుగా ఇవి పని చేస్తాయన్నారు. దేశంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం నిరంతరం జరుగుతున్న కృషికి నూతన వేగం జత కలిసిందన్నారు. గత కొద్ది రోజుల్లో దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ, గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఎయిమ్స్ నిర్మాణం, ఒడిశాలోని సంబల్‌పూర్‌లో ఐఐఎం నిర్మాణం ప్రారంభమైనట్లు తెలిపారు. సంవత్సరం ప్రారంభం మంచిగా ఉంటే, రాబోయే సంవత్సరమంతా గొప్పగా ఉంటుందన్నారు. ఇదంతా మనం కోవిడ్-19తో పోరాడుతున్న సమయంలో సాధించామని చెప్పారు. ఎమర్జెన్సీ వినియోగానికి రెండు మేడ్ ఇన్ ఇండియా కోవిడ్-19 వ్యాక్సిన్లకు అనుమతులు రావడంతో దేశ ప్రజల్లో నూతన విశ్వాసం వచ్చిందని మోదీ తెలిపారు.

# అమెరికా ఘటనలపై ప్రధాని మోడీ ఆందోళన

### ట్రంప్‌మద్దతుదారుల తీరుపై అసహనం

న్యూఢిల్లీ,జనవరి7(ఆర్ఎన్ఎ): అమెరికాలోని కాపిటల్ హిల్‌పై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు చేసిన దాడిని ప్రధాని నరేంద్ర మోదీ ఖండించారు. ఇలా చట్ట వ్యతిరేక నిరసనలతో ప్రజాస్వామ్య ప్రక్రియను అడ్డుకునే చర్యలను సహించకూడదని ఆయన అన్నారు. వాషింగ్టన్ డీసీలో జరిగిన దాడుల వార్తలు చూసి చాలా బాధ కలిగిందని మోదీ అన్నారు. శాంతియుతంగా, క్రమబద్ధంగా అధికార బదిలీ జరగాలి. ఇలాంటి చట్టవిరుద్ధ నిరసనలతో ప్రజాస్వామ్య ప్రక్రియను అడ్డుకునే చర్యలను సహించకూడదని మోదీ ట్వీట్ చేశారు. నవంబర్ 3న జరిగిన ఎన్నికలను తమ నుంచి దొంగిలించారని, తమ నిరసనను ఎవరూ ఆపలేరంటూ డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు కాపిటల్ హిల్‌పై దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ నిరసన హింసాత్మకంగా మారడంతో పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చింది. ఇందులో ఒక మహిళ మృతి చెందగా.. పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. ఈ హింసాత్మక ఘటనలను ప్రపంచ నేతలు ఖండించారు.

# ఈపీటీఆర్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఈపీటీఆర్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నగరంలోని అరణ్యభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ కరోనా మహమ్మారి నేపథ్యంలో ప్రతి ఒక్కరు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విధిగా మాస్కులు, భౌతిక దూరం పాటించాలని చెప్పారు. కాగా, గ్రీన్ స్పేస్ యోగ ఫర్ వెల్నెస్ అనే ఇతివృత్తంతో పాటు ప్రతి నెల జరుపుకునే ముఖ్యమైన పర్యావరణ దినోత్సవాల ఆవశ్యకతను ఈ క్యాలెండర్‌లో పొందుపరిచినట్లు పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ) డైరెక్టర్ జనరల్ అధర్ సిన్హా మంత్రికి వివరించారు.

# జోబైడెన్ ప్రమాణానికి తొలగిన అడ్డంకి

### 20న అమెరికా 46వ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం
### అధికారికంగా ధృవీకరించిన అమెరికా కాంగ్రెస్
### తోకముడిచి అధకార మార్పిడికి అంగీకరించిన ట్రంప్
### దాడి ఘటనలు చీకటిరోజుగా అభివర్ణించిన అమెరికన్లు

వాషింగ్టన్,జనవరి7(ఆర్ఎన్ఎ): అమెరికా 46వ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయడానికి జో బైడెన్‌కు లైన్ క్లియరైంది. ఎన్నికల్లో ఆయన గెలిచినట్లు ప్రకటించిన ఎలక్టోరల్ కాలేజ్ ఫలితాన్ని అమెరికా కాంగ్రెస్ అధికారికంగా ధృవీకరించింది. క్యాపిటల్ హిల్‌పై ట్రంప్ మద్దతుదారులు దాడి చేసిన కొన్ని గంటల తర్వాత కాంగ్రెస్ బైడెన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ హింస తర్వాత తిరిగి సమావేశమైన కాంగ్రెస్‌ను వైస్ ప్రెసిడెంట్ మైక్ పెన్స్ ప్రారంభించారు. ఆ తర్వాత సభ్యులు ఎలక్టోరల్ ఓట్లను లెక్కించి, బైడెన్ ఎన్నికను ధృవీకరించారు. దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తూ.. దీనిని అమెరికా క్యాపిటల్ చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎట్టకేలకు తన ఓటమిని అంగీకరించారు. జో బైడెన్‌దే గెలుపంటూ అమెరికా కాంగ్రెస్ ప్రకటించిన కొద్ది నిమిషాలకే ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. తాను స్వచ్ఛందంగానే పదవి నుంచి తప్పుకుంటానని, అధికార మార్పిడి పద్ధతి ప్రకారం జరుగుతుందని ఆయన గురువారం ప్రకటించారు. 'ఎన్నికల ఫలితాలను నేను పూర్తిగా వ్యతిరేకిస్తున్నప్పటికీ..వాస్తవాలు కూడా నన్నే సమర్థిస్తున్నప్పటికీ..జనవరి 20న నిబంధనల ప్రకారం అధికార మార్పిడి జరుగుతుంది. అమెరికా చరిత్రలోనే మహాద్భుత పాలనకు దీంతో ముగింపు పడినట్లైంది. అయితే. గొప్ప దేశాన్ని సాకారం చేసేందుకు వేం చేస్తున్న పోరాటానికి మాత్రం ఇది ఆరంభం అని ఆయన ప్రకటించారు. నవంబర్ 3న జరిగిన ఎన్నికల్లో బైడెన్‌కు 306, ట్రంప్‌కు 232 ఎలక్టోరల్ ఓట్లు వచ్చిన సంగతి తెలిసిందే. ఎన్నికల ఫలితాలను అంగీకరించడానికి నిరాకరించిన ట్రంప్.. చివరి నిమిషం వరకూ అడ్డుకోవడానికి ప్రయత్నించారు. తన మద్దతుదారులను రెచ్చగొట్టి క్యాపిటల్ హిల్‌పై దాడికి ఉసిగొల్పారు.

ఇదిలావుంటే అమెరికా చరిత్రలో ఇది ఒక చీకటి రోజని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. ట్రంప్మద్దతుదారుల దాడితో ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల్లో ఒకటైన అగ్రరాజ్యం ఒక్కసారి ఉలిక్కిపడింది. అధ్యక్ష హోదాలో ఉన్న వ్యక్తే తన మద్దతుదారులను రెచ్చగొట్టి సాక్షాత్తూ యూఎస్ కాంగ్రెస్‌పైకే ఉసిగొల్పిన తీరు చూసి ప్రపంచమే నివ్వెరపోయింది. అగ్రరాజ్యాన్ని ఏలే చట్టసభల ప్రతినిధులే నాలుగు గంటల పాటు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని సొరంగంలోకి పారిపోవాల్సి వచ్చింది. నవంబర్ 3న జరిగిన ఎన్నికల్లో తాను ఓడిపోయానని తెలిసినా.. మొండి పట్టు వీడని డొనాల్డ్ ట్రంప్ అధికార దాహానికి అద్దం పట్టిన ఘటన ఇది. ఈ హింసలో నలుగురు చనిపోగా.. ఎంతోమంది గాయపడ్డారు. అసలు ఈ హింస దారి తీసిన సంఘటనలు ఏంటి? బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో ఏం జరిగిందన్నది ఒకసారి చూద్దాం. బుధవారం ట్రంప్‌కు మద్దతుగా వేలాది మంది ప్రజలు రాజధానిలోని ఎలిప్స్‌లో గుమిగూడారు. భారీ ర్యాలీ తీయుడానికి వాళ్లు సిద్ధమయ్యారు. అంతకుముందు రోజు రాత్రే వేల మంది అక్కడికి చేరుకోవడం విశేషం. ఈ ర్యాలీ గురించి డిసెంబర్ 19నే ట్రంప్ ట్వీట్ చేశారు. జనవరి 6న డీసీలో భారీ నిరసన ప్రదర్శన ఉంటుందని చెప్పారు. అందరూ రావాలి అంటూ ట్రంప్ ఆ ట్వీట్‌లో పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు ట్రంప్ సేవ్ అమెరికా ర్యాలీ ప్రారంభమైంది. దీనిని ట్రంప్ కుమారులు ఎరిక్, డొనాల్డ్ ట్రంప్ జూనియర్‌తోపాటు ఆయన లాయర్ రూడీ గిలానీ మొదలుపెట్టారు.

ఉదయం 11.50 గంటల ప్రాంతంలో ర్యాలీని ఉద్దేశించి ట్రంప్ మాట్లాడారు. గంటకుపైగా తన మద్దతుదారులను రెచ్చగొట్టే విధంగా ఆయన ప్రసంగించారు. మనమంతా క్యాపిటల్ హిల్‌కు వెళ్దామని పిలుపునిచ్చారు. ఆయన ప్రసంగం తర్వాత వేలాది మంది యూఎస్ కాంగ్రెస్ వైపు అడుగులు వేశారు. మధ్యాహ్నం 1 గంటకు ఎలక్టోరల్ ఓట్లను లెక్కించడానికి ఉభయ సభల ప్రతినిధులు హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ చాంబర్‌లో సమావేశమయ్యారు. మధ్యాహ్నం 1.10 గంటలకు క్యాపిటల్ హిల్ భవనం దగ్గర పోలీసులతో ఆందోళన కారులు ఘర్షణకు దిగారు. హౌజ్, సెనేట్‌ను వేరు చేసే స్టాచువరీ హాల్ వరకూ ఆందోళనకారులు దూసుకెళ్లారు. ఆ తర్వాత సెనేట్, హౌజ్‌వైపు పరుగెత్తారు. దీంతో వాషింగ్టన్ డీసీ మేయర్ మూరియెల్ బౌజర్ సాయంత్రం 6 గంటల నుంచి సిటీ మొత్తం కర్ఫ్యూ విధిస్తున్నట్లు ప్రకటించారు. గురువారం ఉదయం 6 గంటల వరకూ ఈ కర్ఫ్యూ ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం క్యాపిటల్ హిల్ భవనం బయట పైప్ బాంబు పేలినట్లు రిప్రజెంటేటివ్ ఇలేన్ లూరియా ట్వీట్ చేశారు. తమను భవనం నుంచి ఖాళీ చేయిస్తున్నట్లు ఆమె తెలిపారు. పోలీసుల రక్షణ వలయాన్ని ఛేదించిన ఆందోళనకారులు క్యాపిటల్ హిల్ భవనం గోడలపైకి ఎక్కడం ప్రారంభించారు. క్యాపిటల్ హిల్ పోలీసులకు సహకరించాలని, శాంతియుతంగా నిరసన చేపట్టాలని ట్రంప్ ట్వీట్ చేశారు. ఆ తర్వాతి నిమిషంలోనే ఆందోళనకారులు క్యాపిటల్ కిటికీలను బద్ధలు కొట్టారు. ఆ వెంటనే హౌజ్ లోపలి నుంచి బయటకు పోలీసులు ఫైరింగ్ జరిపిన శబ్దం వినిపించింది. ఆందోళనకారులు చాంబర్‌లోకి దూసుకెళ్లారు. ఆలోపే పోలీసులు చట్టసభల ప్రతినిధులను అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈసమయంలోనే యూఎస్ క్యాపిటల్ దగ్గర అందరూ శాంతియుతంగా ఉండాలని, హింస వద్దని ట్రంప్ పిలుపునిచ్చారు. అయితే అప్పటికే పోలీసుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ చనిపోయింది. స్థానిక పోలీసులకు సహకరించడానికి డీసీ నేషనల్ గార్డ్‌కు చెందిన 1100 మంది క్యాపిటల్ హిల్‌కు చేరుకున్నారు. ట్రంప్ ఈసారి ట్విటర్‌లో వీడియో సందేశం విడుదల చేశారు

# మత్స్య ఉత్పత్తికి ప్రోత్సాహం పెరగాలి

నేటి నిజం

శుక్రవారం 8-1-2021

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మత్స్యసంపదకు ప్రోత్సాహం కల్పిస్తే ఈ పరిశ్రమ ఆర్థికంగా బాగా ఎదిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఏపిలో సహజసిద్దంగా సముద్రం, నదులు, చెరువులు కలిసివచ్చే అంశంగా గుర్తించాలి. అయినా అనుకున్నంతగా మత్స్యసంపదను ఎగుమతి చేయలేకపోతున్నారు. నిజానికి ఈ రంగాన్ని ప్రోత్సహిస్తే ఆహార రంగంలో విప్లవం సాధించవచ్చు. మన అవసరాలకు పోను ఎగుమతి చేసుకునే అవకాశం ఉంది. మత్స్యకారులకు ప్రోత్సాహాలు పెరగాల్సి ఉంది. బర్డ్‌ఫ్లూ వంటి సమస్యలు వచ్చినప్పుడు ప్రజలకు ఆహారంగా మత్స్యసంపద ఎంతగానో ఉపయోగ పడుతుంది. చేపలు,రొయ్యలు ఆరోగ్యానికి ఎంతో మంచిది. కరోనా కారణంగా వీటి వాడకం కూడా పెరిగింది. అయినా ప్రజలకు పూర్తిస్థాయిలో ఇవి అందడం లేదు. సహజసిద్దంగా లభ్యమయ్యే చేపలు,రొయ్యలకు తోడు...వాటిని పెంచడానికి చేస్తున్న ప్రయత్నాలకు ప్రోత్సాహం అందించాల్సి ఉంది. ఇకపోతే ఇప్పటికే తెలంగాణలో ప్రభుత్వ ప్రోత్సాహంతో చేపల పెంపకం పెరిగింది. చెరువుల పునరుద్దరణ, నదుల్లో నీటి లభ్యత కారణంగా గణనీయమైన మత్స్య సంపద పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అక్వాకల్చర్ అనేది కేవలం ఏపికి మాత్రమే పరిమితమైన వ్యాపారంగా ఉండగా తెలంగాణలో కెసిఆర్ సర్కార్ తీసుకున్న చర్యలతో ఇప్పుడు మత్స్యకారులు ఆర్థికంగా ఎదుగుతున్నారు. చేపల చెరువులు ప్రత్యేకంగా ఏర్పాటు చేయకపోయినా ఉన్న చెరువుల్లో చేపలసాగు కలిసివస్తోంది. ఉమ్మడి ఏపిలో కోల్పోయిన ప్రాభవం మళ్లీ కళ్లముందు సాక్షాత్కరించింది. ఆక్వా అనగా రొయ్యల సాగు అన్నది బలపడింది. తెలంగాణలో చేపల పెంపకం, రొయ్యల పెంపకం అంతరించిపోయింది. కేవలం ఆంధ్రానుంచి వచ్చే చేపలు, రొయ్యలే దిక్కయ్యాయి. నిజానికి ఈ పరిశ్రమకు చేయూతనిస్తే దేశం మొత్తానికి ఉత్పత్తులను అందించే సత్తా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉండేది. కానీ అలా జరగలేదు. ఇప్పుడు విడిపోయాక రెండు రాష్ట్రాల్లోనూ ఆక్వా కల్చర్ అన్న పదం వ్యాప్తిలోకి వస్తోంది. తెలంగాణలో చేపల పెంపకానికి ఇచ్చిన ప్రోత్సాహం కారణంగా చేపల, రొయ్యల పెంపకంతో అనేక వ్యాపారాలు ముడిపడి ఉన్నాయి. అక్వాకల్చర్ అభివృద్ధితో విస్తరిస్తున్న ఉపాధి, ఉద్యోగావకాశాలు, వ్యాపార, వాణిజ్య లావాదేవీలు, ఎగుమతులు, దిగుమతులు పెరగడం కాయంగా కనిపిస్తోంది. దీంతో గతంలో కన్నా ఏపిలో కూడా ఇప్పుడు ఆక్వా పరిశ్రమకు ప్రోత్సాహం పెరిగింది. ఆక్వాను పర్యావరణ ముప్పు లేనంత వరకు ప్రోత్సహించడం మంచిదే. చెరువులు, కుంటలు, వాగు లు, వంకలు, నదులు, సముద్రా ల్లో సం ప్రదాయ పద్దతుల్లో చేపల పెంపకానికి భిన్నంగా ఆధునిక పద్దత ల్లో, జన్యు మార్పిడితో మత్స్య సంపదను పెంపొం దించే అక్వాకల్చర్ ప్రపంచ వ్యాప్తంగా అనుసరిస్తున్నారు. దీంతో ప్రజల ఆహార నమన్య తీరగలదు. సముద్రజలాల్లో సహజ సిద్ధంగా పెరిగిన మత్స్యసంపదను వేగంగా కొల్లగొట్టడంవల్ల భూమి ఉపరితలం మీద అందుబాటులో ఉన్న జలవనరుల్లో చేపల పెంపకాన్ని ఉధృతం చేయడంతో ఆంధ్రాలో ఆక్వా కల్చర్ పెరిగింది. తెలంగాణ రాష్ట్రం కంటే ఉపరితల జల వనరుల విస్తీర్ణంలో చాలా వెనకబడి ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చేపల ఉత్పత్తిలోనూ, అక్వాకల్చర్ ఉత్పత్తిలోనూ దేశంలోనే అగ్రభాగంలో నిలిచింది. ఉపరితల జలవనరుల విస్తీర్ణంలో దేశంలోనే మూడవ స్థానంలో ఉన్న తెలంగాణ చేపల ఉత్పత్తిలో మాత్రం జాతీయ స్థాయిలో 8వ స్థానంలో వెనుకబడిపోయింది. తెలంగాణ ఏర్పడ్డ తరవాత సిఎం కెసిఆర్ ముందుచూపుతో మత్స్యకారులకు రాయితీలు ప్రకటించి చేపలు, రొయ్యల పెంపకాన్ని ప్రోత్సహించారు. దీంతో గడిచిన మూడేండ్లుగా చెరువుల్లో ఉచిత చేప పిల్లల పెంపకం చేపట్టింది. ఎం కేసీఆర్ చేస్తున్న ప్రతిపాదన తెలంగాణ మత్స్యపారిశ్రామిక రంగానికి ఒక దిక్సూచి లాగా పనిచేస్తుందనడంలో సందేహం లేదు. మత్స్య పారిశ్రామిక రంగం తెలంగాణలో ఇంతగా వెనకబడిపోవడానికి ఏపీతో పోల్చినప్పుడుభిన్నమైన కారణాలు కనిపిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌కు పొడవైన సముద్రతీరంతోపాటు, బ్యాక్‌వాటర్స్, కొల్లేరు లాంటి సహజసిద్ధమైన సరస్సులు, ఉప్పునీటి కయ్యలు, బ్రాకిష్‌వాటర్స్‌లాంటి అనేకరకాలైన జలవనరులు అందుబాటులో ఉన్నాయి. తెలంగాణలో కేవలం భూఉపరితల జలవనరులు మినహా చేపలపెంపకానికి మరే ఇతర వనరులు అందు బాటులో లేవు. తెలంగాణలో మత్స్యపరిశ్రమ అభివృద్ధికి ఇప్పుడు అనుసరిస్తున్న సంప్రదాయ చేపల పెంపకం విధానాలను ఒకవైపు ఆధునీకరించుకుంటూనే, మరోవైపు అక్వాకల్చర్ అభివృద్ధికి ముందుకు సాగాలి. ఇటీవల టూరిజం ప్లాజాలో తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు మన రాష్ట్రంలో అక్వాకల్చర్ అభివృద్ధికి ఉన్న అవకాశాలను, అవసరాలను కూలంకషంగా చర్చించింది. తెలంగాణలో అక్వాకల్చర్ రంగం అభివృద్ధికి తొలి అడుగుగా భావించాలి. ఇక్కడ అక్వాకల్చర్ అభివృద్ధి పరచేందుకు ఇప్పటికే అందుబాటులో ఉన్న 77 మధ్యతరహా, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు ఉన్నాయి. వీటికి తోడుగా కృష్ణా, గోదావరి నదుల మీద నిర్మిస్తున్న నీటిపారుదల ప్రాజెక్టులు, వాటికి అనుబంధంగా నిర్మిస్తున్న అనేక జలాశయాలు, పెద్దచెరువులు కూడా అందుబాటులోకి రాబోతున్నాయి. ఇక్కడి మత్స్యకారులు ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా ప్రగతి సాధించాలి. చేపలను, రొయ్యలను ఉత్పత్తి చేసే అనుబంధ రంగాల్లో ఉపాధి పెరుగుతుంది. బెంగాల్ తదితర రాష్ట్రాల్లో మత్స్యకారులకు ప్రోత్సాహంతో పాటు అవకాశాలు కల్పిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ అలాంటి అవకాశాలను పెంచడం ద్వారా చేపలు, రొయ్యలను ప్రజల నిత్య ఆహారంలో భాగమయ్యేలా చేస్తే ఉపాధికి అవకాశాలు పెరుగుతాయి.

## పెద్దగట్టు జాతరకు భారీగా ఏర్పాట్లు

**అభివృద్ధి పనులకు 2కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం**

నల్లగొండ,జనవరి7(ఆర్‌ఎన్‌ఎ): రాష్ట్రంలోనే ప్రసిద్దిగాంచిన పెద్దగట్టు జాతర అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ. 2 కోట్ల నిధులు విడుదల చేసింది. ఏటా ఈ జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి గ్రామంలో శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతర ప్రతి రెండేళ్లకోసారి జరుగుతుంది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో జరిగే జాతర ఏర్పాట్లకు సంబంధించి ప్రభుత్వం నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. మంత్రి జగదీష్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం రూ. 2 కోట్లను విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతర, యాదవ కులస్తుల ఇలవేల్పు శ్రీ పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర ఏర్పాట్లకు ప్రభుత్వం రూ. 2 కోట్లు కేటాయించడం హర్షణీయమని ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్, పెద్దగట్టు జాతర మాజీ చైర్మన్ కోడి సైదులు యాదవ్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్ రెడ్డి చిత్రపటాలకు యాదవ కులస్తులు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో జాతరకు అంతంతమాత్రంగా నిధులు కేటాయించడంతో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు జరగక భక్తులు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాదవుల మనసెరిగిన ప్రభుత్వమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు అనంతరం ప్రతి రెండేళ్లకోసారి జరిగే జాతరకు మంత్రి జగదీశ్ రెడ్డి ప్రత్యేక ప్రణాళికతో విజయవంతం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి జగదీశ్ రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జటంగి నాగరాజు, పల్లప సోమేశ్, గడ్డం నారాయణ, జాతంగి లింగరాజు, బొద్దు కిరణ్ తదితరులు ఉన్నారు.

## తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్య

కామారెడ్డి,జనవరి7(ఆర్‌ఎన్‌ఎ): జిల్లాలోని దేవునిపల్లిలో విషాదం చోటు చేసుకుంది. తల్లిదండ్రులు మందలించారని నీలం రాహుల్ (18) అనే యువకుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాహుల్ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నిన్న రాత్రి తన స్నేహితుని అన్న పెళ్లి ఊరేగింపుకు వెళ్లిన రాహుల్‌ను ఆలస్యం కావడంతో ఫోన్లో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన రాహుల్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొన్న నటుడు అజయ్ దేవగన్

యాదాద్రి-భువనగిరి,జనవరి7(ఆర్‌ఎన్‌ఎ): ఏ ఛాలెంజ్ అయినా కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని.... గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మాత్రం 3 సంవత్సరాలుగా అప్రతిహతంగా ముందుకుపోతుందని రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం జిల్లాలోని చౌటుప్పల్ మండలం దండు మల్కాపూర్ ఇండస్ట్రియల్ పార్క్‌లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఎంపీ సంతోష్ కుమార్, బాలీవుడ్ హీరో అజయ్ దేవగన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఈ పార్క్‌లో 5 వేల మొక్కలు నాటామని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షిస్తామని అన్నారు. లోక్‌సభ స్పీకర్‌తో సహా అన్ని రంగాల ప్రముఖులు, సెలెబ్రెటీలు గ్రీన్ ఛాలెంజ్‌లో మొక్కలు నాటుతూ ప్రజల్లో ఉత్సాహాన్నీ, స్ఫూర్తిని నింపుతున్నారని ఎంపీ సంతోష్ కుమార్ తెలిపారు.

## గోవుల అక్రమ తరలింపును అడ్డుకోండి: రాజాసింగ్

హైదరాబాద్,జనవరి7(ఆర్‌ఎన్‌ఎ): సైబరాబాద్ సీపీ సజ్జనార్‌కు బీజేపీ ఎమ్మెల్యే రాజసింగ్ మరోసారి సవాల్ విసిరారు. ఐదు రోజుల్లో గోవుల అక్రమ తరలింపును అడ్డుకోకుంటే తానే రంగంలోకి దిగుతానని హెచ్చరికలు జారీ చేశారు. బహుదూర్‌పుర పోలీస్ స్టేషన్ ముందు నుంచి ఆవులను అక్రమంగా తరలిస్తున్న వీడియోలను రాజాసింగ్ బయట పెట్టారు. రాజాసింగ్ హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. మీకు చేత కాకుంటే అనే పదాన్ని తాను ఉపయోగించవచ్చని... కానీ పోలీస్ కమిషనర్‌పై తనకు గౌరవం ఉందన్నారు. ఇప్పటికైనా చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. రాజకీయ నాయకులపై కామెంట్స్ చేయటం కాదని.. అక్రమంగా గోవులను తరలిస్తోన్న వారిపై చర్యలు తీసుకోవాలని రాజసింగ్ డిమాండ్ చేశారు.

## తెలంగాణలో దేవాలయాలకు పూర్వ వైభవం



జగిత్యాల, జనవరి7 : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన తర్వాతే సీఎం కేసీఆర్ అధ్వర్యంలో దేవాలయాలకు పూర్వవైభవం వస్తున్నదని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు దేవాలయాల పునరుద్ధరణకు కూడా సీఎం పెద్ద పీట వేశారన్నారు. అంతేగాక, వెయ్యి కోట్లతో యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని యాదాద్రిగా అభివృద్ధి పరిచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీటీసీలలు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, ఎంపీపీ చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

# పోరుగల్లుగా మారుతున్న ఓరుగల్లు

**ఎన్నికలకు ముందే సవాళ్లు..ప్రతి సవాళ్లు**
**బండి రాకతో వేడెక్కిన రాజకీయం**
**అసలు కార్పోరేషన్ ఎన్నికలు సకాలంలో జరిగేనా**
**డివిజన్ల పునర్విభజనపై తేలని నిర్ణయం**
**మార్చి15న ముగియనున్న పాలకవర్గం గడువు**

వరంగల్,జనవరి7(ఆర్‌ఎన్‌ఎ): వరంగల్ కార్పోరేషన్ ఎన్నికలు ఎప్పుడనేది ఇంకా ప్రకటించక ముందే రాజకీయ వేడి అందుకుంది. బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ పర్యటనతో కాకరేగింది. బండి విమర్శలు ప్రధానంగా టిఆర్ఎస్ అవినీతిపైనే సాగింది. సవాళ్లు ప్రతిసవాళు విసురుకున్నారు. బండి సవాళ్లకు టిఆర్‌ఎస్ కూడా ఘాటుగానే స్పందించింది. దమ్ముంటే నిరూపించాలంటూ టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రతిసవాల్ చేశారు. మొత్తంగా ఇప్పుడు ఓరుగల్లు పోరుగల్లుగా మారుతోంది. ఎన్నికల నాటికి ఇది మరింత ఉధృతం కానుందనడంలో సందేహం లేదు. ఇంతకాలం టిఆర్‌ఎస్ చెప్పిందే వేదంగా రాజకీయాలు నడిచాయి. అలాగే తెలంగాణ సెంటిమెంట్‌తో నెట్టుకొచ్చారు. కానీ ఆ పప్పులు ఉడకవని దుబ్బాక, జిహెచ్‌ఎంసి ఫలితాలు తేల్చడంతో బిజెపి దూకుడు రాజకీయాలు చేపట్టింది. ఎమ్మెల్యేల అవినీతి, భూకబ్జాలపై ప్రధానంగా దృష్టి సారించింది. అలాగే వరదనష్టంపైనా నిలదీసింది. ఏవీ డబుల్ ఇళ్లు అంటూ ప్రశ్నించింది. జీడబ్ల్యూఎంసీ పాలకవర్గం గడువు మార్చి 15తో ముగుస్తుంది. ఈ లోగానే ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం లేదు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో తగిలిన దెబ్బతో ఆలోచనలో పడింది. ఎన్నికలు మాట పక్కన పెట్టి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సంకల్పించారు. మార్చి 1 నుంచి నగరంలో ప్రతీరోజు తాగునీటి సరఫరా చేస్తామని కెటిఆర్ ప్రకటించారు. ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ క్రమంలో ముందుగానే ఎన్నికలు వచ్చే అవకాశాలు లేవు. వస్తే కోడ్ అమల్లోకి వస్తుంది. అభివృద్ధి హంగామా ఉండదు. ఆయా డివిజన్లలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాల అంకం ముగియాలంటే ఇంకా ఆరు నెలలైనా పడుతుందని టీఆర్‌ఎస్ వర్గాలు అంటున్నాయి. ఈ పరిణామా లను పరిశీలిస్తే మార్చిలో కాదు జూన్‌లో ఎన్నికలు నిర్వహించ వచ్చని భావిస్తున్నారు. మొత్తంగా ఇప్పుడు వరంగల్ ఎన్నికలు ఎప్పుడు, డివిజన్లు, పునర్విభజన, రిజర్వేషన్లపై అందరి దృష్టి పడింది. కొద్ది కాలంగా పునర్విభజన ఉంటుందా లేదా అనే డైలమా నెలకొంది. అయితే మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పునర్విభజన ఉంటుందనే వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రి కేటీఆర్ జరిపిన సమావేశం పునర్విభజన ఖాయవని తేల్చింది. ఈ నేపథ్యంలో జీడబ్ల్యూఎంసీ అధికారగణం పునర్విభజనపై దృష్టి పెటారు. తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘం డివిజన్ల పునర్విభజన, జీడబ్ల్యూఎంసీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర పురపాలక శాఖ కు లేఖ రాసిందనే సంకేతాల నేపథ్యంలో జీడబ్ల్యూఎంసీ అధికారులు అప్రమత్తం అవుతున్నారు. మొత్తంగా పురపోరుకు వరంగల్ మహానగర పాలక సంస్థ సమాయత్తమవుతోంది. ఆ లోగా డివిజన్ల పునర్విభజనపై దృష్టి సారించనుంది. ఏ క్షణంలోనైనా ఆదేశాలు రావచ్చంటున్నారు. డివిజన్ల పునర్విభజనపై జీడబ్ల్యూఎంసీ అధికారులు సమాయత్త మవుతున్నారు. అయితే ఇప్పటి వరకు అధికారిక ఆదేశాలు అంద లేదంటున్నారు. విభజన జరగడం ఖాయమనే బలమైన అభిప్రాయంతో అధికారులు ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం పురపాలక శాఖకు లేఖ రాయడం.. ప్రభు త్వం స్పందించడం.. ఈ మేరకు అధికారిక ఆదేశాలు జారీ జరిగిన క్రమంలో ఆ క్షణం నుంచే తమకు పునర్విభజన పని ప్రారంభం అవుతుందంటున్నారు. ప్రస్తుతం జీడబ్ల్యూఎంసీ పరిధిలో 58 డివిజన్లు ఉన్నాయి. 2019 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఈ సంఖ్యను 66కు పెంచుతూ ఆర్డినెన్స్ జారీ చేసింది. డివిజన్ల పునర్విభజన ద్వారా వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధి లో మరో 8 కొత్త డివిజన్లు వెలుస్తాయి. కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలోని కార్పొరేషన్లలో 2019 ఆర్డినెన్స్ మేరకు డివిజన్ల పునర్విభజన జరిగింది. ఫలితంగా పది కొత్త డివిజన్లు ఏర్పడ్డాయి. రెండు కార్పొరేషన్లలో డివిజన్లు 60కి చేరాక ఎన్నికలు కూడా నిర్వహించడం జరిగింది. డివిజన్ల పునర్విభజన ప్రక్రియ రిజర్వేషన్లను మార్చనుంది. ప్రస్తుత డివిజన్లలో మార్పులు చోటు చేసుకుంటాయి. ఇక పునర్విభజనతో డివిజన్ల సంఖ్య 66కు పెరగడంతో మహిళలకు 50 శాతం కేటాయింపు ద్వారా 33 డివిజన్లు వారికి దక్కనున్నాయి. డివిజన్ల పునర్విభజన ఖాయమనే బలమైన సంకేతాల నేపథ్యంలో సిట్టింగ్ కార్పొరేటర్లలో కలవరం నెలకొంది. డివిజన్ల పునర్వి భజన తంతు ముగిశాక జీడబ్ల్యూఎంసీ ఎన్ని కలపై స్పష్టత రానుంది. ప్రస్తుత పాలకవర్గ గడువు మార్చి 15 వరకు ఉంది. రాష్ట్ర ఎన్నికల సంఘం డీలిమిటేషన్‌తో పాటు గడు వులోపే ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేసినా.... ఎన్నికల విషయంలో ప్రభుత్వ నిర్ణయమే ఉంటుందని నిపుణులు అంటు న్నారు. గడువు లోపు ఎన్నికలు జరగని పక్షంలో ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతుంది.

# సీఎం కేసీఆర్‌ను విమర్శిస్తే తగిన రీతిలో బుద్ధి చెప్తాం



నిజామాబాద్, జనవరి7: జిల్లాలోని బాల్కొండ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌పై బీజేపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కొనుగోలు కేంద్రాలు చూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తా. ఒకవేల కొనుగొలు కేంద్రాలు చూపించకుంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఎంపీ అరవింద్ తమ పదవులకు రాజీనామా చేస్తారా అని సవాల్ విసిరారు.

సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే టీఆర్‌ఎస్ కార్యకర్తలు చుసుస్తూ ఊరుకోరన్నారు. టీఆర్‌ఎస్ సంఖ్యా బలం ముందు రాష్ట్ర బీజేపీ బలం చాలా చిన్నది. టీఆర్‌ఎస్ కార్యకర్తలు తిట్టడం మొదలుపెడితే బీజేపీ నేతలు గ్రామల్లో తిరుగలేం న్నారు. ఒకవైపు కేంద్రంలోని బీజేపీ మంత్రులు సీఎం కేసీఆర్ అమలు చెస్తున్న పథకాలను ప్రశంసిస్తుంటే.. బండి సంజయ్, అరవింద్ అవివేకంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం కింద పనిచేసే నీతి ఆయోగ్ కుడా తెలంగాణ సీఎంను ప్రశంసించింది. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు మీరు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చూపించగలరా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ నిర్ణయాలతో తెలంగాణ రాష్ట్రం ఇవాళ దేశానికి అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందన్నారు. నిర్మాణాత్మక విమర్శలు చేస్తే స్వాగతిస్తాం. కానీ అనుచిత వాఖ్యలు చేస్తే తగినరీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

# గ్రంధాలయాలను ఆధునీకరించాలి

**అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచాలి**

హైదరాబాద్,జనవరి7(ఆర్‌ఎన్‌ఎ): రానురాను గ్రంథాలయాల ప్రాధాన్యం తగ్గుతోంది. ఇంటర్‌నెట్ అందుబాటులోకి వచ్చాక గ్రామాల్లో వీటిపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అయితే గ్రంథాలయాలను పటిష్టం చేసుకుంటూ, ఇంటర్‌నెట్‌ను కూడా అందుబాటులోకి చేసుకునే విదంగా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలకు కనీసం చదవడం, రాయడం వంటి విషయాలపై అవగాహన కల్పించాలని ఎస్.సి.ఇ.ఆర్.టి ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇటువంటి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలి. అసెంబ్లీ నియోజక వర్గాల్లో కూడా చిన్న, చిన్న పుస్తక మహోత్సవాలను నిర్వహించి స్థానిక రచయితలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సాహిత్యాన్ని పరిపుష్టం చేయవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో కూడా గ్రంథాలయాలను ఆధునీకరించాలి. పుస్తకాల పఠనంపై ఆసక్తి తగ్గడంతో ఊరూరా గ్రంథాలయాలు నెలకొల్పాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. అంతెందుకు స్కూళ్లలో కూడా గ్రంథాలయాలు అతంతగానే ఉంటున్నారు. పాఠ్యపుస్తకాలు తప్ప ఇతర గ్రంథాలు అందుబాటులో ఉండడం లేదు. రెఫరెన్స్ పుస్తకాలు కూడా దొరకడం లేదు. డబ్బుండి కొనుక్కునే వారికి తప్ప పుస్తకాలు లేక లైబ్రరీలు నిరసించి పోతున్నాయి. అంతకుమించి నేటి విద్యార్థుల్లో పఠనాసక్తి తగ్గుతోంది. కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం అవుతున్నారు. ప్రభుత్వ కళాశాలలు తగ్గడం, సామాజిక శాస్త్రాలు చదివిన వారికి తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల ఆ శాస్త్రాలపై నేటి యువత మొగ్గుచూపటం లేదు. తద్వారా సమాజంతో బంధానికి దూరమౌతున్నారు.

పాఠశాలల్లో ఒకప్పుడు లైబ్రేరియన్లు వుండేవారు. ఇప్పుడు ఆ పోస్టులు భర్తీ కావడం లేదు. ఫలితంగా విద్యాలయాల్లో విద్యార్థులకు పాఠశాలల్లో లభిస్తున్న పుస్తకాలపై అవగాహన కలగడం లేదు. ఇటువంటి పరిస్థితులలో సాహితీవేత్తలు, భాషాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు గ్రంథాలయ ఉద్యమాలు వంటివి మరోసారి ప్రారంభించాల్సిన అవసరం వుంది. ఈ రోజుల్లో పుస్తక ప్రచురణ కష్టసాధ్యంగా మారింది. పాలకుల నుండి కూడా పెద్దగా ప్రోత్సాహం లభించడం లేదు. కేవలం పోటీ పరీక్షల కోసం ముద్రించే పుస్తకాలకు మాత్రమే డిమాండ్ ఉంటోంది. యువతలో ఎక్కువ మంది సినీ సాహిత్యానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. 'యునెస్కో' అంచనా ప్రకారం ప్రతి ఐదు వేల మందికి ఒక గ్రంథాలయం ఉండాలి. మన దేశంలో కేవలం 75 వేల గ్రంథాలయాలున్నాయనేది ఒక అనధికార అంచనా. గ్రంథాలయాల్లో పోస్టుల భర్తీ కూడా సక్రమంగా జరగడం లేదు. చాలా గ్రంథాలయాలను ఆధునీకరించడం లేదు. లైబ్రరీలలో పాత పుస్తకాలే దర్శనమిస్తున్నాయి. గ్రంథాలయ వారోత్సవాలని కూడా మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు. ఆ రోజుల్లోనే అయ్యంకి రమణయ్య గ్రంథాలయాల అభివృద్ధికి పది ఎకరాల స్థలాన్ని దానం చేసి 'గ్రంథాలయ ఉద్యమ పిత' గా పేరు పొందారు.

## తెలంగాణలో రైతులకు దన్నుగా ప్రభుత్వం

**పెట్టుబడి సాయంతో పాటు ఉచితవిద్యుత్**
**రైతుబీమాతో కుటుంబాలకు భరోసా: మంత్రి**

హైదరాబాద్,జనవరి7(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణలో మాత్రమే రైతులకు అండగ ఆసర్కార్ అనేక నిర్ణయాలు తీసఉకుని వారికి ప్రోత్సాహం ఇస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. రైతులకు బీమా, పెట్టుబడి సాయం, ఉచిత విద్యుత్ వంటి ప్రోత్సాహకాలు మరెక్కడా లేవన్నారు. కొత్త వ్యవసాయ చట్టాలతో లాభం ఎలా ఉన్నా రైతులకు మాత్రం ఇప్పటికిప్పుడు కలిగే లాభం కనపించడం లేదన్నారు. వెంటనే రైతుల ఆందోళనలకు స్వస్తి పలకాలని అన్నారు. అప్పుల ఊబినుంచి బయటపడడానికి ఆత్మహత్యలను ఆశ్రయిస్తున్న రైతులకు తెలంగాణ పసర్కార్ అండగా నిలవడం వల్లనే రైతు ఆత్మహత్యలు పూర్తిగా తగ్గాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పరిస్థితిని మార్చేలా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నారు. రైతులకు పెట్టబడతో పాటు రాయితీ విత్తనాలు, ఎరువులు అందుతున్నాయి. అలాగే బీమా సౌకర్యం అందుతున్నది. ఇకపోతే 24 గంటల ఉచిత కరెంట్ అందుతోంది. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహకాలు పెంచుతున్నామని అన్నారు. అంతేగాకుండా బలవంతంగా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కూడా నిర్ణయించామన్నారు. సిఎం కెసిఆర్ తీసుకున్న నిర్ణయాల కారణంగా రైతులకు భరోసా దక్కి వ్యవసాయం ముందుకు సాగుతుంది. మనరైతులనే ప్రోత్సహించి మన పంటలనే కాపాడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరని గుర్తించి సిఎం అనేక చర్యలు తీసుకున్నారని అన్నారు. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయాలన్నారు.

## కోలుకున్న క్రికెటర్ గంగూలీ

**ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన దాదా**



కోల్‌కతా,జనవరి7(ఆర్‌ఎన్‌ఎ): టీమిండియా మాజీ కెప్టెన్, బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ఆస్తప్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. గుండెపోటుతో కోల్ కతాలోని ఉడ్ ల్యాండ్స్ ఆసుపత్రిలో ఇటీవలే చేరారు. గురువారం గంగూలీని వైద్యులు డిశ్చార్జ్ చేశారు. గంగూలీ ఆసుపత్రిలో చేరారనే విషయం తెలియగానే అందరూ షాక్ కు గురయ్యారు. ఆయన కోలుకోవాలని అందరూ ఆకాంక్షించారు. ఆసుపత్రి వెలుపల మాట్లాడుతూ తన పరిస్థితి పూర్తిగా బాగుందని, వైద్యులకు, ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు చెబుతున్నానని తెలిపారు. బుధవారమే గంగూలీని డిశ్చార్జి చేస్తామని మొదట వైద్యులు వెల్లడించగా.. కొన్ని కారణాల వల్ల ఆయనను వైద్యులు డిశ్చార్చి చేయలేదు. ప్రస్తుతం గంగూలీ ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. నేటి నుంచి గంగూలీ ఆరోగ్య పరిస్థితిని ఆయన ఇంట్లోనే వైద్యులు పర్యవేక్షించ నున్నారు. వుడ్‌ల్యాండ్స్ ఆస్పత్రిలో చేరిన ఆయన యాంజియోప్లాస్ట్ చేయించుకున్న ఆరు రోజుల తర్వాత గురువారం డిశ్చార్జ్ అయ్యారు. వైద్యం అందించిన వుడ్‌ల్యాండ్ ఆస్పత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు దాదా. ప్రస్తుతం ప్రస్తుతం పూర్తి ఆరోగ్యంతో ఉన్నానని గంగూలీ చెప్పుకొచ్చారు. ఆస్పత్రిలో వైద్యులు జాగ్రత్తగా చూసుకున్నారని.. నా జీవితం తిరిగి పొందడానికి వారు సాయపడ్డారని గంగూలీ చెప్పారు. త్వరలోనే జీవితాన్ని యధాప్రకారంగా కొనసాగించేందుకు మానసికంగా సిద్ధంగా ఉంటానని ఆశిస్తున్నానని.. నేను బాగానే ఉన్నానని గంగూలీ వెల్లడించారు. శనివారం ఉదయం జిమ్ చేస్తున్న సమయంలో గంగూలీకి ఒక్కసారిగా ఛాతీనొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. కోల్‌కతాలోని వుడ్‌ల్యాండ్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. గుంగూలీకి గుండె పోటు వచ్చిందన్న వార్త తనను బాధించిందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ట్వీట్ చేశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. గంగూలీకి ఆస్పత్రిలో చేరారన్న వార్త వినగానే భారత క్రికెటర్లు, మాజీ క్రికెటర్లతో పాటు అభిమానుల్లో ఆందోళన నెలకొని.. ఆయన త్వరగా కోలుకోవాలని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా గంగూలీతో ఫోన్ లో మాట్లాడి.. ఆరోగ్యం గురించి వాకబు చేశారు. గంగూలీ డిశ్చార్జ్ అవ్వడంతో అందరూ సంతోషిస్తూ ఉన్నారు.

## బండి సంజయ్‌ను విమర్శించే స్థాయా నీది

**బాల్క సుమన్‌పై మండిపడ్డ బిజెపి ఎస్సీ మోర్చానేతలు**

హైదరాబాద్,జనవరి7(ఆర్‌ఎన్‌ఎ): టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు బీజేపీ దళిత నాయకుల హెచ్చరికలు జారీ చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను విమర్శించే స్థాయి బాల్క సుమన్‌కు లేదని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. ఎస్సీలకు ఏం చేశావని కేసీఆర్‌ను బాల్కా సుమన్ నిలదీయాలన్నారు. కేసీఆర్ కుటుంబానికి సలాం కొట్టుకుంటూ బతకటం మాత్రమే బాల్క సుమన్‌కు తెలుసని శృతి విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి హామీ ఏమైందో బాల్క సుమన్ చెప్పాలన్నారు. ఎంపీగా.. ఎమ్మెల్యేగా బాల్క సుమన్ దళితులకు చేసింది శూన్యమన్నారు. బీజేపీ లేకుంటే తెలంగాణ రాష్ట్రం లేదని టీఆర్‌ఎస్ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. బండి సంజయ్‌పై సంస్కార హీనంగా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. టీఆర్‌ఎస్ నాయకలకు వారి భాషలోనే తిరిగి సమాధానం చెప్తామని శృతి స్పష్టం చేశారు. కల్వకుంట్ల కుటుంబం వేసే బిస్కెట్లకు బాల్క సుమన్ మొరుగుతున్నాడని బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొప్పు బాష విమర్శించారు. బాల్క సుమన్ నుంచి సంస్కారం నేర్చుకునే స్థాయి తమది కాదన్నారు. దళితులను ముఖ్యమంత్రి ఎందుకు చేయలేదో.. బాల్క సుమన్ కేసీఆర్‌ను అడగాలన్నారు. ఓయూలో బాల్క సుమన్ బతుకేంటో తమకు తెలుసన్నారు. దళితులకు టీఆర్‌ఎస్‌లో స్వతంత్రం ఉందా? అనే విషయంలో బాల్క సుమన్ ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల కేరాఫ్ అడ్రస్ భూకబ్జాలు, అవినీతి అని కొప్పు భాష విమర్శించారు. రేపు ఏ పార్టీలో ఉంటాడో తెలియని పరిస్థితి వినయ్ భాస్కర్‌దని విమర్శించారు. అలాంటి టీఆర్‌ఎస్ నాయకులకు బండి సంజయ్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. పద్ధతి మార్చుకోకుంటే.. బాల్క సుమన్ బొక్కలు చూర చూర చేస్తామని హెచ్చరించారు.

## ఉత్తరాది గాలులతో వణికిస్తున్న చలి

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ చలి పెరిగింది. ఉత్తరాది నుంచి వస్తున్న శీతల గాలులే ఇందుకు కారణమని వాతావరణ అధికారులు చెబుతున్నారు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో కూడా చలి పెరిగింది. ఛత్తీస్‌గఢ్‌లో ఉపరితల గాలులు వీస్తున్నాయి. వాటి వల్ల తెలంగాణలో వాతావరణం చల్లబడి చలి పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రంతెలిపింది. . ఉత్తర భారతంలో సైతం పశ్చిమ అస్థిర గాలులు అధికంగా వీస్తున్నాయి. వాటి ప్రభావం కూడా తెలంగాణపై ఉందని ఆయన వివరించారు. శనివారం నుంచి 3 రోజుల దాకా సాధారణంకన్నా నాలుగైదు డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, చలి అధికంగా ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## జాగృతి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

వరంగల్,జనవరి7(ఆర్ఎన్ఎ): జాగృతి ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామీణ జిల్లా పరిధిలో ముగ్గుల పోటీలు, భోగి మంటల కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు జాగృతి జిల్లా నాయకులు చెప్పారు. మహిళల్లో సృజనాత్మకతను వెలికితీయాలనే ఉద్దేశంతో జాగృతి పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు.. దీనిలో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. పోటీల్లో పాల్గొని ప్రతిభకనబర్చిన వారికి బహుమతులు అందిస్తామని చెప్పారు.

## పెళ్లిబృందంతో వెళుతున్న బొలెరో బోల్తా

### 17మందికి తీవ్ర గాయాలు: ముగ్గురి పరిస్థితి విషమం

సూర్యాపేట,జనవరి7(ఆర్ఎన్ఎ): సూర్యాపేట జిల్లాలోని జాజిరెడ్డిగూడెం వద్ద గురువారం మధ్యాహ్నం ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. పెళ్లి బృందంతో వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 17 మంది తీవ్రంగా గాయపడగా, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ వీరయ్య మద్యం సేవించి వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. మద్యం మత్తులో అతివేగంగా నడపడం వల్లే వాహనం బోల్తా కొట్టిందని పేర్కొన్నారు. బాధితులంతా అర్వపల్లి మండలం బొల్లంపల్లి వాసులుగా పోలీసులు గుర్తించారు. వీరంతా ఊట్కూర్‌కు పెళ్లికి వెళు ందగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## శ్రీకాంతాచారి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎర్రబెల్లి



జనగామ జిల్లాలో తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

జనగామ,జనవరి7(ఆర్ఎన్ఎ): దేవరుప్పుల మండలం గొల్లపల్లిలో తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి విగ్రహాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం ఆవిష్కరించారు. అలాగే రూ.4.52కోట్లతో చెక్‌డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.1.20కోట్లతో వ్యయంతో పూర్తి చేసిన డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించారు. దేవరుప్పుల మండల కేంద్రంలో రూ.2.47 కోట్లతో నిర్మించిన 49 డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించి, లబ్ధిదారులకు అందజేశారు. అలాగే రూ.22 లక్షలతో పూర్తి చేసిన రైతు వేదికను ప్రారంభించారు. రూ.16లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. రూ.5లక్షలతో నిర్మించిన యాదవ కమ్యూనిటీ హాల్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ నిఖిల, ఆయా శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

## జీతాలు అడిగితే అవమానమా: అనిత

విశాఖపట్టణం,జనవరి7(ఆర్ఎన్ఎ): పాడేరులో నర్సుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తెలుగు మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఖండించారు. జీతాలు ఇవ్వమని మంత్రి అవంతి శ్రీనివాస్‌ను నర్సులు అడగటం నేరమా అని ప్రశ్నించారు. నర్సుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తప్పుబట్టారు.అధికార మదంతో మంత్రి వాహనం కూడా దిగలేదని మండిపడ్డారు. కరోనాపై పోరాడిన ఫ్రంట్ లైన్ వారియర్స్‌కు వైసీపీ ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. పాడేరు ఘటనపై సీఎం జగన్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అవంతి శ్రీనివాస్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## 60 ఏళ్ల దరిద్రాన్ని ఆరేళ్లలో పారదోలిన కెసిఆర్

### ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నల్లగొండ,జనవరి7(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో 60 ఏండ్ల దారిద్ర్యాన్ని ఆరేండ్లలో తీర్చామని, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాలోని అర్వపల్లి, తుంగుతుర్తి మండలకేంద్రాల్లో జరిగిన నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత సాగు, తాగునీటి రంగంతోపాటు రైతుల సమస్యలను తీర్చడానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతనిచ్చిందన్నారు. ఇకనుంచి రాబోయేది ఉద్యోగులు, నిరుద్యోగుల శకమని, ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా తీర్చడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 1.26 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేటు రంగంలో సుమారు 24 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచిన నాటి నుంచి ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు.

తన ఎమ్మెల్సీ పదవీకాలంలో ఇప్పటివరకు ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికే కృషి చేశానని తెలిపారు. గ్రామాల్లో కనిపించే అభివృద్ధిని చూసి వివేకవంతులైన పట్టభద్రులు ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్‌రావు, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, రైతుబంధు సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు రజాక్, జడ్పీటీసీలు దావుల వీరప్రసాద్ యాదవ్, కందాల దామోదర్‌రెడ్డి, ఎంపీపీలు మన్నె రేణుక, గుండగాని కవితరాములుగౌడ్ తదితరులుపాల్గొన్నారు.

## ఇక మరింత సులువుగా జనన మరణ ధృవీకరణ పత్రాలు

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ):జనన మరణ ధృవీకరణ పత్రాలు పొందడం ఇక మరింత సులువు కానుంది. జీహెచ్ఎంసీలో జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీలో కొత్త విధానం అమల్లోకి వచ్చింది

. జనన, మరణ దరఖాస్తుల స్వీకరణ, సర్టిఫికెట్ల జారీని జీహెచ్ఎంసీ సిటీజన్ సర్వీస్ సెంటర్లతో పాటు ఇకపై మీ–సేవా కేంద్రాల్లో కూడా సేవలు అందుబాటులో వచ్చాయి. పునర్ వ్యవస్థీకరించిన ఈ కొత్త విధానంలో సర్కిళ్లలోని అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ల(ఏఎంసీ)ను సబ్ రిజిస్ట్రార్లుగా గుర్తిస్తూ బాధ్యతలను కేటాయించింది. పుట్టిన, మరణించిన 30 రోజుల్లోపు చేసుకునే దరఖాస్తుల పరిశీలన, జారీచేసే అధికారాన్ని ఏఎంసీలకు అప్పగించారు. నెల తరువాత నుంచి ఏడాది వరకు సమయంలో వచ్చిన దరఖాస్తులను రిజిస్ట్రార్లుగా ఉండే ఏ.ఎం.హెచ్.ఓ లు పరిశీలించి జారీచేస్తారు. ÷–రస్తుతం వార్డు యూనిట్ గా ఉన్న జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ ఇక సర్కిల్ యూనిట్ గా మారుతూ జనవరి 1వ తేదీ నుండి నూతన విధానం అమలులోకి వచ్చింది. గడిచిన డిసెంబర్ 20వ తేదీ నుండి జనవరి 5వ తేదీ వరకు 13,026 జనన, మరణ ధృవీకరణ పత్రాలు జారీచేయగా వీటిలో జనవరి 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు మీ–సేవా కేంద్రాల ద్వారా 7,561 సర్టిఫికెట్లు జారీ అయ్యాయి.

# కరోనా కోరల నుంచి బయటపడని విద్యారంగం !

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): కరోనా ఉపద్రవం ఇంకా ముగియలేదు. అనేక రంగాలు అతలాకుతలం అయ్యాయి. వివిధ రంగాలను పక్కన పెడితే విద్యారంగం మాత్రం దారుణంగా దెబ్బతిన్నది. వేలాది పాఠశాలలు మూతపడడంతో లక్షలాది మంది ఉపాధ్యాయులు ఉపాధి లేకుండా రోడ్డున పడ్డారు. విద్యార్థుల్లో సృజనాత్మకత కొరవడి ఇంటికే పరిమితం అయ్యారు. ఆన్‌లైన్ చదువులు మనకు అబ్బవన్న విసయం కూడా రూఢీ అయ్యింది. పిల్లల్లో సృజనశీలత కూడా పోయింది. టీచర్‌కు,విద్యార్థులకు ఉండాల్సిన బంధం తెగిపోయింది. ఈ దశలో స్కూళ్లు ఎప్పుడు తెరుస్తారా అని తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. స్కూళ్లు తెరిచినా తెరవకున్నా ఫీజులు విషయంలో మాత్రం ప్రైవేట్ స్కూళ్లు మొండిగా వ్యవహరిస్తున్నాయి. ఒక్క పైసా కూడా తగ్గేది లేదంటూ బెదిరింపులకు దిగి వసూళ్లకు తెగబడుతున్నారు. చేతకాని ప్రభుత్వాల కారణంగా సామాన్యులు నష్టపోతున్నారు. అధికారం లో ఉన్నవారికి, విపక్షంలో ఉన్నవారికి విద్యాసంస్థల్లో భాగస్వామ్యం కారణంగా మిన్నకుంటున్నారు. తల్లి దండ్రులు రోడ్డెక్కుతున్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు, సరికదా దారుణంగా ఉంది. ప్రభుత్వ విద్యా రంగాన్ని కార్పోరేట్‌కు దీటుగా మారుస్తామని, పాఠశాలల ముఖచిత్రాన్ని మార్చి వేస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించినా ఆ హామీలు అమలు కావడం లేదు. వారికి చిత్తశుద్ధి ఉన్నట్లు కనిపించడం లేదు. కరోనావేళ కాలంకలసి రావడంతో ప్రభుత్వాలు దీనిని సాకుగా చూపి తప్పించు కున్నాయి. విద్యారంగాన్ని పటిష్ట పరచాల్సిన సమయంలో చేష్టలుడిగి చూస్తున్నాయి. కొత్త విద్యావిధానం ప్రకటించినా కోరోన కారణంగా దానిని అమలు చేయడంలో అవకాశం రావడం లేదు. ఇకపోతే రాష్ట్రాల పరిధిలో కార్పోరేట్ కాలేజీలు లక్షల్లో ఫీజులు గుంజుతున్నా ప్రభుత్వాలు చేష్టలుడిగి చూస్తున్నాయి. మన పాఠశాలలు కనీస వసతుల్లేవు. మన ప్రమాణాలు నానాటికి తీసికట్టుగా మారుతున్నాయి. గ్రామీణులు, పేదలు, కింది వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నారు. మధ్యతరగతికి సైతం చదువు భారంగా మారింది. ఊహించ లేనంత అసమానతలు ఒకటో తరగతి నుంచే ఎదురవుతున్నాయి. ప్రస్తుతం చేపడుతున్న పథకాలు, సంస్కరణలు ఈ సమస్యల నుంచి మన పాఠశాల విద్యారంగాన్ని గట్టెక్కించగలిగితే అంతకు మించి ఆశయం మరోటి ఉండదు. పిల్లల చదువులు భారమైనందు వల్ల మన అక్షరాస్యత తక్కువగా వుందని, ప్రైవేటు చదువు మరీ భారంగా వుందని ఈ పథకాన్ని తెచ్చామంటుంది ప్రభుత్వం. సమస్యకు మూల కారణం ఊళ్లో బడి దివాళా తీయడం. కనీస వసతులు, చదువులు లేక ప్రజల్నించి దూరం గావడం చూస్తున్నాం.కొత్త సంవత్సరంలో బడులు తెరుచుకుంటాయా అన్న ఆందోళన మరోవైపు తల్లిదండ్రులను వేధిస్తోంది. చదువులు సాగుతాయా లేదా అని నిత్యం ఆరా తీస్తున్నారు. కొత్త రకం కరోనా స్ట్రెయిన్ సమస్యను తిరగబెడుతుందా అన్న ఆందోళన మరోవైపు భయపెడుతోంది. 2021 కూడా పూర్తిస్థాయిలో ప్రజాజీవనాన్ని పునరుద్ధరించలేకపోవచ్చని తాజా పరిణామాలను బట్టి అర్థం అవుతోంది. మనుషులు కోలుకుని మామూలుగా ముందుకు సాగుతారా లేదా అన్న ప్రశ్నలు ఉదయిస్తున్న వేళ చదువులపై ప్రతి ఒక్కరిలోనూ ఆందోళన కొనసాగుతోంది. అన్నిటికంటె ప్రాణం, ఆరోగ్యం ముఖ్యం అని గుర్తించినవారు వయోధికులనే కాదు, పిల్లలను కూడా కాపాడుకోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. బాలబాలికలు, ముఖ్యంగా ప్రాథమిక, ప్రాథమికపూర్వ తరగతుల పిల్లలు తిరిగి పాఠశాలలకు రావడం, వచ్చే విద్యా సంవత్సరంలో జరిగే పనేనా? లేకపోతే, ఫలితంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులను ఎట్లా ఎదుర్కొనాలి అన్న మథనం సాగుతోంది. ముందుచూపుతో ప్రభుత్వాలు చేయవలసిన ఆలోచనలు ఇప్పుడు ఎవరికి వారు చేస్తున్నారు. దేశాల మధ్య విద్యా వినిమయం, పర్యాటకుల సందడి పూర్తిగా పూర్వస్థితికి రాలేదు.

విమానాలు ఆగిపోయాయి. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకున్న వారి ఆశలు గల్లంతయ్యాయి.ఈ సంవత్సరం కాలగర్భంలో ఆవిరైపోయినా ఆశలు మాత్రం సజీవంగానే ఉన్నాయి. పిల్లల చదువుల్ని మూల్యాంకనం చేసి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, మారుతున్న అవసరాలకు తగ్గ పాఠ్యాంశాలు రూపొం దించి, శిక్షణలిచ్చి ఎప్పటికప్పుడు సృజనాత్మకంగా బోధనాభ్యసనాలు సాగేలా చూసే బాధ్యత ఇప్పుడు ప్రభుత్వాలపై ఉంది. కరోనా కాలంలో విద్యాసంస్థలను నడపడమెలా..చదువులను ముందుకు తీసుకుని పోవడమెలా అన్న చర్చ సాగాలి. సర్వీసు నిబంధనల సాకుతో అన్ని పోస్టులు ఖాళీగా వున్నాయి. ఒక స్పష్టమైన దృక్పథం వుంటే మొదట దీనిపైన దృష్టి సారించాల్సి వుంటుంది. అన్ని స్థాయిల్లో బలమైన వ్యవస్థల్ని నిర్మించాల్సి వుంటుంది. వ్యవస్థలోని మరో బలహీనత ప్రజల్ని ఏ మాత్రం భాగస్వాముల్ని చెయ్యలేకపోవడం వల్ల కూడా వెనకబడ్డాం. బడిని ఒంటరిగా మార్చడం. పంచాయతీలకు, స్థానిక దాతలకు స్థానం లేకుండా పోవడం అన్నది కూడా విద్యారంగం తిరోగమనానికి కారణంగా చూడాలి. కరోనా కారణంగా అసలు స్కూళ్లు తురవకుండా ఉంటే ఎలా అన్నది కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా ఆలోచనచేయాలి. రాజకీయాలను పక్కన పెట్టి విద్యారంగాన్ని ముందుకు తీసుకుని పోవడమెలా అన్న చర్చ చేయాలి. అక్షరాస్యతలో దేశం ఇప్పటికే వెనకబడి ఉంది. కరోనా కారణంగా దాని శాతం మరింత పెరిగిందే తప్ప తగ్గదు. వెనకబడిన ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలకు ఇంతకుముందే విద్య అందడం లేదు. ఈ దశలో ఉన్న స్కూళ్లను మూసేయడం, క్రమబద్ధీకరించడం చేస్తున్న కారణంగా అసలు లక్ష్యం దెబ్బతింటోంది. మారుమూల ప్రాంతా పిల్లలకు సైతం విద్యను నేర్పాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిన స్కూళ్లను క్రమబద్ధీ కరణ పేరుతో మూసేయడం వల్ల పిల్లలకు విద్యను దూరం చేసిన వారం అయ్యాం. అలాగే కరోనా కారణం గా ఇప్పుడా ప్రభావం కనిపించకున్నా భవిష్యత్‌లో దాని ప్రభావం పడక మానదు. దీనికితోడు స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరతతో పాటు, సమస్యలు తిష్టవేసుకున్నాయి. వీటిని పరిశీలించి పరిష్కరించాల్సిన పాలకులు విద్యా రంగాన్ని చిన్నచూపు చూస్తున్నారు. విద్యారంగంలో మనం ముందుకు పోతున్నామని నాయకులు చెప్పింది నమ్మడానికి లేదు. కరోనా సమస్యలను అధిగమించేలా విద్యారంగాన్ని ముందుకు తీసుకుని వెళ్లేందుకు అవసరమైన చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి. అప్పుడే దేశ భవిష్యత్‌కు భరోసా కలుగుతుంది.

### పాఠశాలల బలోపేతం ఓ మిథ్య

## ఎపిలో అమ్మ ఒడి చేపట్టినా కానరాని మార్పులు

అమరావతి,జనవరి7(ఆర్ఎన్ఎ): జగన్ నేతృత్వంలో ఎపిలో కొత్త ప్రభుత్వం కొలువు తీరగానే గతంలో ఎప్పుడూ లేనట్టు విద్యారంగ సంస్కరణల కోసం కసరత్తు ప్రారంభించింది. 'అమ్మ ఒడి' ప్రకటనతో ఇది మొదలైంది. తరచూ స్వయంగా ముఖ్యమంత్రి సమీక్షలు చేసి, దిశా నిర్దేశం చేస్తున్నారు. దీనికోసం ఒక నిపుణుల కమిటీని వేశారు. గత బడ్జెట్ సమావేశాల్లో రెండు చట్టాలు తెచ్చి, ఉన్నత, పాఠశాల విద్యా వ్యవస్థల్ని పర్యవేక్షించేందుకు, ప్రైవేటు సంస్థల నియంత్రణకు రెండు కమిషన్లు నియమించారు. అలా 'నాడు–నేడు' మొదలైంది. గొప్ప విద్యావేత్తలను, పరిపాలనా దక్షులను వివిధ కమిటీల్లోకి ఆహ్వానించారు. నిజానికి నిరుపేదలు కూడా ప్రైవేటును ఆశ్రయించడం తగదన్న రీతిలో సాగింది. అమ్మ ఒడికి రూ.6,300 కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వం, అదే సొమ్ముతో మన పాఠశాలల్ని చూడముచ్చటగా మార్చి వుంటే అద్భుతాలు జరిగేవి. రెండు మూడేళ్లలో వీటి రూపురేఖలే మారి పొయ్యేవి. మంచి చదువు పేద పిల్లలకూ దక్కేది. ఆ ఊరి పిల్లలు ఆ ఊరి బడిలోనే చదివే స్థితి వుంటే మన విద్యారంగం ఎలా వుంటుందో ఒకసారి ఊహించుకొంటే ఇది తెలిసొస్తుంది. ప్రభుత్వ బడిని మార్చకుండా తల్లి దండ్రులకు నగదు ఇవ్వడం వల్ల మార్పు వస్తుందనుకోవడం పొరపాటే. విమర్శలు వచ్చే సరికి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తామని 'నాడు–నేడు' పథకం తెచ్చారు. నలభై వేల పై చిలుకు స్కూళ్ల నుంచి 15 వేల స్కూళ్లను ఎంపిక చేసి వీటికి తొమ్మిది రకాల వసతులు కల్పిస్తామని ఉత్తర్వు లిచ్చారు. నిర్బంధంగా ప్రస్తుతం తెలుగు మీడియంలో వున్న పాతిక లక్షల మందిని ఇంగ్లీషు మీడియంలోకి మార్చాలని నిర్ణయించారు. నిపుణుల కమిటీలన్నీ ప్రాథమిక విద్య వరకైనా మాతృభాషా మీడియం వుండి తీరాలంటున్నాయి. నూతన విద్యా విధానం కూడా ఇదే చెబుతోంది. ప్రభుత్వం నియమించిన కమిటీ కూడా ఇదే పేర్కొంది. కేంబ్రిడ్జి, అజీం ప్రేంజీ ఫౌండేషన్లు చేసిన పరిశీలనల్లో ఇంగ్లీషు మాధ్యమం తీవ్ర నష్టం తెచ్చిందని తేలింది. ఆంగ్ల మాధ్యమాన్ని మొండిగా ఎవ్వరూ వ్యతిరేకించడం లేదు. మొదట మాతృభాషలో ప్రారంభించి ఒకానొక దశలో ఆంగ్లంలోకి మళ్లించాలని మాత్రమే చెబుతున్నారు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాల్లో జరుగుతున్నదీ ఇదే! ఇంగ్లీషు మీడియం పెడితే మంచి చదువు చెప్పేసినట్లు అవుతుందనుకొంటుంది ప్రభుత్వం. ప్రస్తుత టీచర్లు దీనికెంత అర్హులన్న ప్రశ్న కూడా వుంది. నాడు–నేడు నిధుల్ని పాఠశాల విద్యా కమిటీలే వ్యయం చేసేలా ఉత్తర్వులిచ్చారు. ఉన్నత పాఠశాలల్ని గుర్తించి, అన్ని హంగులు కల్పించాలి. బలమైన అకడమిక్ వ్యవస్థను రూపొందించాలి. అధ్యాపకుల్ని నియమించి ప్రయోగాత్మకంగా కొన్ని చోట్ల ప్రారంభించి దీనికి పూను కోవాలి. ప్రస్తుత జూనియర్ కళాశాలల్ని, అందులోని రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకుల్ని ఎలా సర్దుబాటు చెయ్యాలో కూడా చర్చించాలి. మన ప్రాథమిక పాఠశాలలు కనీస వసతుల్లేని, ఒకటి రెండు గదుల్లో నడుస్తున్నాయి. వాటిలోకి పసి బిడ్డల్ని తేవడం వారికి రక్షణ కల్పించడం అంత సులవైనపనిగాదుని గుర్తించి ముందుకు సాగితేనే మనుగడ సాధ్యమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## కరోనాపై ఎప్పటికీ అప్రమత్తంగా ఉండాల్సిందే

### వ్యాక్సిన్ వచ్చిందన్న ధీమా పనికి రాదంటున్న నిపుణులు
### అది తాత్కాలిక ఉపశమనమే అని హెచ్చరిక

న్యూఢిల్లీ,జనవరి7(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ తన రూపం మార్చుకొని మళ్లీ విజృంభిస్తోన్న ఈ సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కరోనా టీకా వచ్చినా ఈ అప్రమత్తత నిరంతరంగా కొనసాగాలని సూచిస్తున్నారు. ముఖానికి మాస్క్ పెట్టుకున్నాం కదా అని కరోనా సోకదని అనుకోవద్దు. బయటకు వెళ్లినప్పుడు, జన సందోహం ఉన్నచోట మాస్క్‌తో పాటు దూరం పాటించడం చాలా ముఖ్యం అని పరిశోధకులు అంటున్నారు. అమెరికాలోని న్యూ మెక్సికో యూనివర్సిటీ పరిశోధకులు సాధారణ క్లాత్ మాస్క్, రెండు పొరల మాస్క్, సర్జికల్ మాస్క్, ఎన్95 మాస్క్‌లు కరోనా కణాలను ఎంతగా నిలువరిస్తాయో తెలుసుకునేందుకు ప్రయోగాలు చేశారు. వారి పరిశీలనలో అన్ని మాస్క్‌లు కరోనా వైరస్ వ్యాప్తిని కొంత వరకు అడ్డుకుంటాయని తేలింది. అయితే సామాజిక దూరం పాటించకపోవడం వల్ల వైరస్ సోకే అవకాశాలు ఎక్కువని కనుగొన్నారు. మాస్క్ కచ్చితంగా కరోనా సోకకుండా రక్షణనిస్తుందని, దానితో పాటే సామాజికి దూరం పాటించాలని, చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని, శానిటైజర్ వాడాల్సిందేనని అన్నారు. అయితే బాగా దగ్గరగా ఉంటే మాత్రం వైరస్ సోకే వీలుందని అంటున్నారు. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న కరోనా వైరస్‌ను వ్యాక్సిన్‌తో తగ్గించుకోవచ్చు కానీ వదిలించుకోలేమని వారు చెబుతున్నారు.

ఇప్పటికే కరోనా విశ్వరూపం కారణంగా లక్షలాది మంది మృత్యువాత పడ్డారు. పెళ్లిమంటపాలతో కళకళలాడాల్సిన ఎన్నో పెళ్లిల్లు ఆగిపోయాయి. లేదా గుట్టుచప్పుడు కాకుండా పూర్తయ్యాయి. 2020 సంవత్సరంలో కొవిడ్–19 సృష్టించిన బీభత్స దృశ్యాలు కొత్త సంవత్సరంలోనూ ఉండకపోవచ్చు. కానీ కరోనా మాత్రం మనలను నిత్యం వెన్నాడుతూనే ఉంటుందని గుర్తించాలి. గడచిన ఏడాదిని తలచుకుంటే, అది మనుషులను ఎంతగా విషాదానికి గురిచేసిందో ప్రతి ఒక్కరికీ అనుభవక పూర్వమే. ఎప్పుడూ ఏ కొత్త సంవత్సరం మీదా ఆశ లేదు. కానీ 2021 మీద ఆశలు పెరగడానికి గత ఏడాది బాధలే కారణం. కొత్త సంవత్సరం ఆరోగ్యవంతంగా సాగాలని, రోగాలను తరిమివేయాలని కోరుకుంటున్నాం. ప్రపంచపటం మీద కరోనా తెచ్చిన కొద్దిపాటి ఊరట వ్యాక్సిన్ వసతుందన్న సమాచారమే. మొత్తం మీద ప్రపంచంలో ప్రజల చైతన్యం కారణంగానే మరణాలు తగ్గాయి. అదే సమయంలో కొవిడ్ ప్రజల్లో చైతన్యాన్ని నింపింది. కొత్త సంవత్సరం తప్పనిసరిగా ప్రపంచాన్ని ఎంతో కొంత మెరుగుపరుస్తుందన్న భావనలో ప్రతి ఒక్కరూ ఉన్నారు. 2020ని తట్టుకుని నిలిచిన అనుభవం అందుకు పనికివస్తుంది. ఆరోగ్య రక్షణ కోసం ఆచితూచి జీవితపు అడుగులు వేసినందున, ఆ జాగ్రత్త ఈ ఏడు కూడా పనికివస్తుంది. తమ ఆరోగ్యాన్ని దృఢపరచు కునే చర్యలు తీసుకుని, అందుబాటులో ఉన్న అవకాశాలతోనే జీవికకు భరోసా కల్పించుకునే ప్రయత్నాలు చేయవలసి వస్తుంది. అందువల్ల గతేడాది రక్షణ చర్యలు కొనసాగాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## గజ్వేల్‌లో భూసార పరీక్ష ల్యాబ్‌కు మంత్రి హరీశ్ శంకుస్థాపన

సిద్దిపేట,జనవరి7(ఆర్ఎన్ఎ): ప్రపంచానికి అన్నం పెట్టేది రైతన్నలని, అలాంటి రైతులకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి హరీష్ రావు అన్నారు. రైతులోకానికి అవసరమైన సమగ్ర సమాచారం అందించేందుకే రైతువేదికలు ఉపయోగపడుతాయన్నారు. రైతుల విజయగాధలను రైతువేదికల ద్వారా రైతులందరికీ తెలియచేస్తామన్నారు. సేద్యం బాగుంటే సమాజం బాగుంటదన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ వ్యవసాయానికి చేయూతనిస్తున్నట్లు తెలిపారు.గజ్వేల్‌లోని స్థానిక మార్కెట్ యార్డులో నిర్మించ తలపెట్టిన భూసార పరీక్ష కేంద్రానికి మంత్రి హరీశ్‌రావు గురువారం శంకుస్థాపన చేశారు.



ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. వ్యవసాయ సూచనలు, ఎరువులు, పురుగుమందులు దశలవారీగా రైతువేదికల ద్వారా అందించనున్నట్లు తెలిపారు. భూసార పరీక్షలు చేయించి రైతులకు సమగ్ర సమాచారం తో భూరికార్డులు అందజేస్తామని చెప్పారు. పంటలకు ధర నిర్ణయించేది కేంద్ర ప్రభుత్వం. అది కేంద్రం చేతుల్లోనే ఉంటుంది. కొత్త వ్యవసాయ చట్టంతో రైతులు పండించిన పంటలకు లాభం జరుగుతదని బీజేపీ నేతలు చెబుతున్నారు. అయితే కొత్త వ్యవసాయ చట్టం ప్రకారం కొనుగోలు కేంద్రాలు ఉండవన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు నీళ్లు, రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటు అందించి పంటలసాగుకు సహకరిస్తున్నా రన్నారు. రైతులు పండించిన పంటలకు మంచి ధర ఇచ్చి కేంద్రం రైతులకు లాభం చేకూర్చాలి అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర వ్యవసాయ విధానం కావాలి

### కార్పోరేట్లకు దోచిపెట్టే చట్టాలు ఎందుకు?
### రైతులు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోరా: మధు

విజయవాడ,జనవరి7(ఆర్ఎన్ఎ): బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం అని సిపిఎం నేత మధు మండిపడ్డారు. వ్యవసాయ చట్టాలపై సమగ్ర చర్చ లేకుండా పాస్ చేసిన ప్రభుత్వం ఇప్పుడు రైతులు రెండు నెలలుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయిందన్నారు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండగా అందుకు భిన్నంగా వారి కష్టార్జితాన్ని కార్పోరేట్లకు కట్టబెట్టేలా చట్టాలు తెచ్చారని అన్నారు. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. విత్తనాలు, పురుగు మందుల వ్యాపారస్థులు నకిలీలతో రైతులను నిలువునా ముంచుతున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు. బ్యాంకు అధికారులు, ఏజెంట్లు కలిసి రైతులకిచ్చే ఋణాలలో కోత పెడుతున్నారు. అడ్తిదారులు, కమీషన్ ఏజెంట్లు, మార్కెట్ అధికారులు, అంతిమంగా అందరూ రైతులను ముంచడానికే సిద్ధంగా ఉన్నారని మండిపడ్డారు. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దీనికి తాజా ఉదాహరణ కంది, మిర్చి పంటలే. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అవసరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదని సిపిఎం నేత అన్నారు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదన్నారు. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకు సరిపోతుంది. ప్రతి ఎకరాకు కౌలు 10 వేల నుంచి 25 వేల రూపాయల వరకు భూమి యజమానులకు చెల్లించవలసి వస్తుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం మంచిగా అయినప్పటికీ ధరలు రాక నష్ట పోతున్నారు. మార్కెట్‌లో రైతును దోచుకునే శక్తులు నిరాటంకంగా విజృంభిస్తూనే ఉన్నాయి. రైతులను దోచుకుంటున్న వారికి తిండి ఎలా వంటబడుతుందో అర్థం కావడం లేదు. రైతులకి మేలు చేస్తానన్న ప్రభుత్వాల ప్రకటనలు ఆచరణలోకి రావడం లేదు. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగిపోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగదీస్తున్నాయి. చాలామంది రైతులు, కౌలుదారులు బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారు, వడ్డీ వ్యాపారస్థుల దగ్గర అప్పు తీసుకుంటే తడిసి మోపెడవుతుంది. ఈ సమస్యలను అధిగమించి రైతుకు అండగా ఉండాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించాలని అన్నారు.

## పోశవ్వ కుటుంబానికి బియ్యం వితరణ

### సహాయ, సేవా కార్యక్రమాలు చిరస్థాయిగా మిగులు పోతాయి
### ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామి




రాజన్న సిరిసిల్ల, జనవరి 7 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ మండల అర్బన్ రుద్రవరం గ్రామానికి చెందిన పాముల పోశవ్వ ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకొన్న అదే గ్రామా ఎంపిటిసి గాలిపెల్లి సువర్ణ స్వామి గౌడ్ మృతురాలి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం 25కిలోల బియ్యాన్ని మృతుని కుటుంబ సభ్యులను అందజేశారు మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు .ఈ సందర్భంగా ఎంపీటీసీ సువర్ణ స్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇతరులకు సేవ చేయడం అలవర్చుకోవాలని అన్నారు. మనము చేసే సహాయ, సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ హృదయాల్లో చిరస్థాయిగా మిగిలిపోతాయి అని అన్నారు .కాగా సహాయం అందించిన వారికి పోశవ్వ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి గ్రామ అధ్యక్షులు గోనె భాస్కర్ ,మాజీ ఎంపీటీసీ అల్వాల కవిత పర్శరాములు ,బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కసర్ల అరుణ్, గ్రామ ప్రధాన కార్యదర్శులుపార్వతి వేణు ,గాలి పెల్లి శ్రీనివాస్,మైలారం మహేష్,మండల కార్యవర్గ సభ్యుడు బెజు గంశంకర్, తదితరులు పాల్గొన్నారు

## న్యాక్‌ను తనిఖీ చేసిన డిజి

కామారెడ్డి,జనవరి7(ఆర్ఎన్ఎ): జిల్లా కేంద్రంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని న్యాక్ డైరెక్టర్ ఆఫ్ జనరల్ భిక్షపతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టైలరింగ్, పెయింటింగ్, ప్లంబింగ్‌లో నైపుణ్య శిక్షణ తీసుకుంటున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, న్యాక్ వైస్ చైర్మన్ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వృత్తి నైపుణ్య కేంద్రాలకు ప్రాధాన్యతను ఇస్తున్నారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఆసక్తి గల నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని భిక్షపతి అన్నారు.

## ఆడపిల్లల పెండ్లిళ్లకు తోబుట్టువులా సీఎం కేసీఆర్'



సిద్దిపేట,జనవరి7 : తల్లి బరువును దించేలా.. తోబుట్టువులా సీఎం కేసీఆర్ కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు అందిస్తున్నట్లు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పర్యటనలో మంత్రి గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రూ.4.79 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ, మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో కలిసి ప్రారంభోత్సవాలు చేశారు. అదే విధంగా సమీకృత ఆఫీసు కాంప్లెక్సులో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభ సమావేశంలో మంత్రి మాట్లాడారు.

సిద్దిపేట జిల్లాలో 5,588 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ కింద రూ.48 కోట్ల 45 లక్షల సాయం అందించినట్లు వెల్లడించారు. పేదింటి ఆడ పిల్లల పాలిట కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ ఓ వరమన్నారు. ఇవాళ రూ.4.79 కోట్లతో గజ్వేల్‌లో వివిధ అభివృద్ధి పనుల కార్యక్రమాలు చేసుకుంటున్నాం. రూ.30 లక్షలతో షీ టాయిలెట్స్, రూ.81.25 లక్షలతో భూసార పరీక్షా కేంద్రం, ఎడ్యుకేషన్ హబ్ లో రూసా నిధులు రూ.80 లక్షలతో సోలార్ సిస్టమ్, పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు.

# హైదరాబాద్‌లో బిజెపి ఇన్‌ఛార్జ్ తరుణ్ చుగ్

## ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహంపై నేతలతో సమీక్ష

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ తరుణ్ చుగ్ గురువారం బీజేపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలపై నన్నాపాక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఎన్నికపై సమీక్ష చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, లక్ష్మణ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, జిల్లా అధ్యక్షులు, ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహంపై తరుణ్ చుగ్ దిశానిర్దేశం చేయనున్నారు. ఇదిలావుంటే హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ సిట్టింగ్ స్థానాన్ని మరోసారి కైవసం చేసుకుంటామని బీజేపీ ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఆయనిక్కడ మీడియాతో మాట్లాడుతూ 5 లక్షల 80వేల ఓట్లు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో నమోదయ్యాయని తెలిపారు. 3 లక్షల ఓట్లను బీజేపీ అనుబంధ సంస్థలు నమోదు చేయించాయని చెప్పారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై బీజేపీ పోరాటం చేస్తోందని తెలిపారు. నోటిఫికేషన్ల పేరుతో నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. నిరుద్యోగుల తరఫున బీజేపీ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ సునాయాసంగా గెలుస్తుందని తెలిపారు. దుబ్బాక, జీహెచ్ఎంసీ ఎన్నికల ఫలితాలే రానున్న ఎన్నికల్లో పునరావృతం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు.

# రక్త దాన అవగాహన కరపత్రం విడుదల





రాజన్న సిరిసిల్ల, జనవరి 7 (నేటినిజం ప్రతినిధి): జాతీయ యువజన దినోత్సవం (జనవరి-12) ను పురస్కరించుకొని యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10 తేదీన వేములవాడ లో నిర్వహించ బోయే రక్త దాన శిబిరం కు జిల్లా కలెక్టర్ శ్రీ కృష్ణ భాస్కర్ ఆహ్వానిస్తూ, రక్త దాన అవగాహన కర పత్రం గురించి వివరించి వారికి పూల మొక్కను అందిచడం జరిగింది,దీనికి స్పందిస్తూ కలెక్టర్ యువ ఫౌండేషన్ ద్వారా మంచి కార్యక్రమాలు నిర్వహిస్తూ యువత కు స్ఫూర్తి గా నిలుస్తున్నారు అని అభినందించారు, అదేవిదంగా వేములవాడ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ చంద్రకాంత్ కూడా కరపత్రం ను ఆవిష్కరించారు. ఈ కరపత్రం విడుదల సందర్బంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొడిశెల రాజశేఖర్ మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరం నుండి రక్త దానం మీద అవగాహన పెంచాలి అనే ఉద్దేశ్యం తో రక్త దాన అవగాహనా చైతన్య యాత్ర ను మొదలు పెడుతున్నట్టు తెలిపారు,రక్త కొరత లేని సమాజం నిర్మించటం కోసం ఈ యాత్ర మొదలు పెట్టినట్టు తెలిపారు, తన అన్న కీ. శే. గొడిశెల.

శ్రీనివాస్ చనిపోయే ముందు హైదరాబాద్ హాస్పిటల్ లో ఆపరేషన్ కు ఎనిమిది యూనిట్ల రక్తం కావాల్సినపుడు తాను పడ్డ కష్టం ఇతరులు పడకూడదు అనే ఉద్దేశ్యం తో తాను ఈ అవగాహన యాత్ర మొదలు పెడుతున్నట్లు తెలిపారు. అదేవిదంగా రక్త దానం మీద కొందరికి అవగాహన లేక రక్త దానం చేయటానికి ముందుకు రావటం లేదని, రాష్ట్రము లో చాలా మంది పిల్లలు తలసేమియా వ్యాధి తో బాధ పడుతున్నారని మరియు రక్త కొరత లేని సమాజం కోసం మా వంతు బాధ్యత గా గత మూడు సంవత్సరాలనుండి 2500 పైగా మందికి ప్రత్యక్షం గా పరోక్షంగా రక్త దానం చేయటం చేయించటం జరిగింది అని, రక్త దానం మీద అవగాహన కల్పించటానికి ఈ యాత్ర మొదలు పెట్టాం అని అదేవిదంగా ఆరోగ్య వంతులై 18-60 సంవత్సరాల వయసు కలిగిన ప్రతీ ఒక్కరు సంవత్సరం లో కనీసం రెండు సార్లు రక్త దానం చేయటం వల్ల కొన్ని రకాల వ్యాధుల నుండి రక్షించబడటమే కాకుండా ఇతరుల ప్రాణాలు నిలబెట్టిన వారవుతారు, అని తెలిపారు. ఈ కార్యక్రమం లో యువ ఫౌండేషన్ చీఫ్ అడ్వైజర్ సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పిల్లి రామచంద్రం గౌడ్, ఫౌండేషన్ ఉపాధ్యక్షులు బొంగాని శ్రీకాంత్, సభ్యులు విశాల్ కుమార్, ఎంద్రాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మందు బాబులకు కరోనా హెచ్చరిక

## వ్యాక్సిన్ తీసుకోవాలంటే మందు మానేయాలి

న్యూఢిల్లీ,జనవరి7(ఆర్ఎన్ఎ): ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ కి వ్యాక్సిన్ అందుబాటులోకి రావడం గుడ్ న్యూస్ అయితే ఈ విషయం మందుబాబులకు మాత్రం సంతోషాన్ని ఇవ్వడంలేదు. ఈ వ్యాక్సిన్ తీసోవడానికి ముందు, తరువాత వారు మద్యపానానికి దూరంగా ఉండాలని లేదంటే ఈ మందు పనిచేయదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రముఖ ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రాసక్స్ భారియా.. ఓ ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థతో మాట్లాడుతూ మద్యం వల్ల వ్యాక్సిన్ తీసుకోవడానికి కలిగే నష్టం గురించి వివరించారు. ఇందులో భాగంగా భారియా.. ప్రాసెక్కో అనే వైట్ వైన్ తాగిన కొంతమంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. మద్యం వల్ల వారిలో లింఫోసైట్ కణాలు 50 శాతానికి పడిపోయినట్లు కనుగొన్నారు. ఈ సందర్భంగా మాంచెస్టర్ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ షీనా క్రూక్‌శాంక్ మాట్లాడుతూ.. లింఫోసైట్ కణాలు పడిపోవడం వల్ల వ్యాక్సిన్ ప్రభావం తగ్గిపోతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు ప్రజలు వీలైనంత వరకు మద్యానికి దూరంగా ఉండాలని కోరారు. వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు రోజు రాత్రి మద్యం తాగొద్దు. అలాగే, వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత కూడా మద్యాన్ని ఒక రోజు ముట్టుకోవద్దని తెలిపారు. 'ల్యాండ్‌జైబిల్' వెబ్‌సైట్ కథనం ప్రకారం.. మన తెల్ల రక్త కణాల్లో 20 నుంచి 40 శాతం వరకు లింఫోసైట్ కణాలు ఉంటాయని తెలిపారు. రోగ నిరోధక వ్యవస్థకు ఇవి ఎంతో కీలకమైనవే కాకుండా తప్పనిసరిగా ఉండాల్సిన కణాలని పేర్కొన్నారు. వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు, ఆ తర్వాత.. ఈ కణాలు క్షీణిస్తే సరిగ్గా పనిచేయదని స్పష్టం చేస్తున్నారు. ఇండియాలో వ్యాక్సినేషన్ ప్రక్రియ మొదలుకానున్న నేపథ్యంలో నిపుణుల సూచనలు హెచ్చరిక కావాలి.

# కాంగ్రెస్‌లో సాగుతోన్న పిసిసి పీఠం ఎంపిక

## ఎటూ తేల్చుకోలేక పోతున్న కాంగ్రెస్ అధిష్టానం

హైదరాబాద్,జనవరి6(ఆర్ఎన్ఎ): తెలంగాణ పీసీసీ అధ్యక్షుడి నియామకం పై కాంగ్రెస్ అధిష్టానం మైదానంలో లాగా సాగదీస్తోంది. అది ఎంతకాలమైనా కావచ్చు లేదా..క్షణకాలంలో తేల్చేయవచ్చు. ఇదే సమయంలో ఎన్నుకోవడం కన్నా కులమతాలు, ప్రాంతాల మధ్య సమీకరణలు సాగుతున్నాయని తెలుస్తోంది. ఎవరికి పీసీసీ పీఠం కట్టబెడితే కాంగ్రెస్‌ను దూసుకుపోగా ముందుకు తీసుకుని వెళతారన్నదే దానికి పెద్ద ప్రతిపాదనగా ఉండబోతోంది. ఇకపోతే గల్లీ నుంచి ఢిల్లీ దాకా అన్నట్లు ప్రతి ఒక్కరూ తామే పీసీసీ చీఫ్‌కు అర్హులమన్న అత్యాశతో కాంగ్రెస్ నేతలు ఉండడం కారణంగా ఎంపిక ప్రక్రియ చర్చల అంకానికి ఆలస్యం అవుతోంది. పీసీసీ అధ్యక్షుడిగా ఎవరిని ఎంపిక చేస్తారన విషయమై తేలకపోవడానికి ఇది కడూఅ కారణంగా భావించాలి. ఇకవ అనే పలుపేర్లు చర్చకు వచ్చిన తరుణంలో తెలంగాణ పీసీసీ అధ్యక్ష పదవికి సీనియర్ నేత టి.జీవన్ రెడ్డిని నియమించనున్నారని, ఈ విషయాన్ని స్వయంగా సోనియా గాంధీనే ప్రకటిస్తారనే వార్తలు వినిపించాయి. సోనియా గాంధీ నిర్ణయాన్ని వాయిదా వేయాలని కోరుతూ.. పలువురు రాష్ట్ర నేతలు అధిష్టానానికి ఫోన్ చేసినట్లు కూడా తెలుస్తోంది. టీపీసీసీ అధ్యక్ష పదవికి రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భట్టి విక్రమార్క తదితరులతోపాటు తటస్థ నేతగా జీవన్‌రెడ్డి పేరును కూడా సోనియాగాంధీ ముందుంచగా, ఆమె తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఏఐసీసీ వర్గాలు చెప్పాయి. జీవన్‌రెడ్డి పీసీసీ పదవి పట్ల ఆసక్తి చూపలేదని కూడా వారు వేదికలో ప్రస్తావించినట్లు తెలిసింది. మరోవైపు జిల్లాల నుంచి అనేక మంది అధిష్ఠానానికి ఫోన్లు చేసి రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని సమర్థించినట్లు సమాచారం. నాగార్జునసాగర్ ఉప ఎన్నికకు త్వరలో షెడ్యూలు వెలువడే అవకాశం ఉందని, ఈలోపు నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని కొందరు చెప్పడంతో అధిష్టానం తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు తెలుస్తోంది. సాగర్ ఉప ఎన్నిక నేపథ్యంలో సామాజిక కూర్పు వివాదాస్పదం కాకుండా ఉండాలంటే ఆ ఎన్నిక తర్వాతే కసరత్తు కొనసాగించాలని పార్టీ అధిష్ఠానం యోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్నికలు, పరిస్థితులన ఆకళింపు చేసుకుని పార్టీని ముందుకు ఎవరు తీసుకుని వెళతార్న చర్చ ఏ స్తాయిలోనూ జరగడం లేదని ప్రస్తుత పరిస్థితిని బట్టి తెలుసుకోవచ్చు. తొందరపడి నిర్ణయం తీసుకుంటే పార్టీలో గందరగోళం చెలరేగుతుందని, చాలా మంది నేతలు కాంగ్రెస్‌ను వీడి ఇతర పార్టీల్లో చేరడంతోపాటు ప్రాంతీయ పార్టీని కూడా ఏర్పాటుచేసే అవకాశాలు ఉన్నాయంటూ హెచ్చరికలు కూడా చేస్తున్నారని సమాచారం. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా రెండు మూడు రోజుల్లో స్వదేశానికి వస్తోన్న నేపథ్యంలో... ఆయన వచ్చాకే తుది నిర్ణయం వెలువడుతుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇకపోతే ఎంపీ రేవంత్‌రెడ్డికి పీసీసీ చీఫ్ పదవి ఇవ్వొద్దని మొదటి నుంచి బహిరంగంగానే జగ్గారెడ్డి, విహెచ్ తదితరులు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇదే విషయాన్ని నేరుగా రేవంత్‌కు చెప్పారు. దీంతో పీసీసీ కొత్త చీఫ్ ఎంపిక తర్వాత జగ్గారెడ్డి, విహెచ్ తదితరులు తన దారి తాను చూసుకుంటారన్న చర్చ మొదలైంది.

# అందరికీ విద్య ఉద్యమంగా సాగాలి

## స్కూళ్లు తెరిస్తే సమస్యలు లేకుండా చేయాలి

## నిపుణులైన బోధకులను టీచర్లుగా నియమించాలి

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): కరోనాతో స్కూళ్లు మూతపడ్డా ఎప్పటికో ఒకప్పటికి తెరవక తప్పదు. అలాగే ఉపాధ్యాయుల కొరత, పదోన్నతులు వంటి సమస్యలు తీర్చాల్సిందే. ఈ దశలో విద్యారంగం పటిష్టత కోసం గతంలో చేసిన హామీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు,. కెజి టూ పిజి అన్న ప్రతిపాదన కోల్డ్ స్టోరేజీకి వెళ్లింది. ఉపాధ్యాయులు లేక నేటికీ తెరవని పాఠశాలలు కోకొల్లలు. గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక అనేక స్కూళ్లు మూతపడి వున్నాయి. గిరిజన గ్రామాలకు నేటికీ రవాణా సౌకర్యం లేదు. వారికి కరెంట్ అంటే ఏమిటో తెలియదు. విద్యవైద్యం వారి దరికి చేరడం లేదు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కలు, భౌతిక శాస్త్రం, సామాన్య శాస్త్రాలకు స్జబెక్టు టీచర్లు లేరు. రాష్ట్రం లోని కొన్ని వేల స్కూళ్లు 5 తరగతులకు కలిపి ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. విద్యలో తెలుగు రాష్ట్రాలు వెనకబడి పోవడానికి సరైన దృక్పథం, చిత్తశుద్ది లేకపోవడంగా చూడాలి. ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం కారణంగా విద్యారంగం కుదేలవుతోంది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. ఇకపోతే ఎపిలో ఇంగ్లీషు మాధ్యమంతో ముందుకు పోదామని ప్రభుత్వం భావిస్తున్నది. అయితే కరోనాతో ఆ ప్రతిపాదనా వెనక్కి పోయింది.తెలుగు మీడియం ఎందుకు వద్దని అడిగితే పేదలకు ఇంగ్లీషు వద్దా? అన్న చర్చ సాగింది. నాయకుల పిల్లలు ఇంగ్లీషులో చదువుకుంటుంటే పేదల పిల్లలు చదువు కోకూడదా? అన్న మౌళిక ప్రశ్నలు వచ్చాయి. డబ్బున్న వాళ్ళు లక్షల రూపాయలు పోసి ఇంగ్లీషులో చదువుకోగా, పేదలకు ప్రభుత్వం ఉచితంగా ఇంగ్లీషు చదువు చెప్పడం తప్పా? అని ముఖ్యమంత్రి, ఆయన మంత్రివర్గ సహచరులు, అనుచరగణం వేస్తున్న ప్రశ్నలకు సమాధానం రావడం లేదు. ఇంగ్లీషు మాధ్యమం పెట్టడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయెుద్దనే అడుగుతున్నారు. అయితే ఇంగ్లీష్ మీడియం ప్రకటించడానికి ముందు ఆ మేరకు స్కూళ్లను, తయారు చేసి టీచర్లను నియమించాల్సి ఉంది. ప్రకటనలు బాగున్నా ఆచరణలో పక్కా ప్రణాళిక ఉండాలి. మాధ్యమం గొడవ పక్కన పెట్టి పిల్లలందరికి విద్యను చేరువ చేసే కార్యక్రమం జరగాలి. ఏ ఒక్క పిల్లవాడు బడిబయట ఉండకుండా చూడాలి. అప్పుడు తెలుగా, ఇంగ్లీషా అన్న తర్కం చేయవచ్చు. మాతృభాష ద్వారానే జాతి సంస్కృతి, సాంప్రదా యాలు నిలబడతాయని అందరి అభిప్రాయం. ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు పదేపదే ఇదే విషయాన్ని చెబుతున్నారు. మాతృభాషా బోధనే మేలంటున్నారు. ఇంగ్లీష్ నేర్పడం వేరు.బోధన వేరని ఆయన అభిప్రాయంగా ఉంది. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, వికాసానికి సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత పరిశోధనలు పరిగణలోకి తీసుకోవాలి. భాషా శాస్త్రవేత్తలు, సంఘాలు, రాజకీయ పార్టీలతో సంప్రదించాలి, చర్చించాలి. అతి చిన్న దేశాలు మొదలు అతి పెద్ద జనాభాగల చైనా వరకు అన్ని దేశాలూ వారి మాతృభాష లోనే ప్రాథమిక విద్య బోధిస్తున్నాయి. కొన్ని దేశాలు పి.జి వరకు మాతృభాషనే వాడుకుంటున్నాయి. జపాన్, జర్మనీ, ఫ్రాన్స్‌తో సహా అత్యంత అభివృద్ధి చెందిన దేశాలు మాతృభాష మాధ్యమంలోనే నడుస్తున్నాయి. చిన్న దేశమైన క్యూబా మాతృభాష లోనే వైద్యంలో అద్భుతాలు సాధించింది. మన దేశంలో అన్ని రాష్ట్రాలు వారి భాషా మాధ్యమంలో విద్యను కొనసాగిస్తు న్నాయి. విద్యలో దేశంలోనే కేరళ ముందున్నది. అది కూడా మాతృభాష లోనే ప్రాథమిక విద్యను అందిస్తున్నది. కేరళ ప్రజలే ఎక్కువగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంగ్లీషు నేర్చు కోవడంలో తప్పులేదు. మాతృభాషలో బోధన చేస్తూనే ఇంగ్లీష్,హిందీభాషలు నేర్పితే సరిపోతుంది. తెలుగే అర్థం కాక వారి తెగల భాషలో వాలంటీర్లు అనువాదం చేస్తే తప్ప గిరిజన పిల్లలు స్కూలుకు రాని పరిస్థితి వుంది. ఇక ఇంగ్లీషు రుద్దితే బడి మానేస్తారు తప్ప అద్భుతంగా రాణించలేరు. ఇంట్లో తెలుగు, ఊరిలో తెలుగు, సమాజమంతా తెలుగు వినిపిస్తోంది. పుట్టిన దగ్గర నుండి తెలుగు వింటూ, మాట్లాడుతుంటారు. కనుక తెలుగులో క్లిష్టమైన విషయాన్ని కూడా అర్థం చేసుకోడానికి అవకాశం వుంది. ఇంగ్లీషు భాషలో అర్థం చేసుకోవడం కష్టం. ఇంగ్లీషు తెలియని ఇళ్ళు, సమాజం నుండి వివరణ అడిగి తెలుసుకునే అవకాశం తక్కువ. అందువలన ప్రాథమిక విద్యా స్థాయిలో... ఆంగ్ల మాధ్యమం లో విషయ పరిజ్ఞానం, జ్ఞాన సంపాదన కష్టం. పైగా పేదలు తమ పిల్లలకు డబ్బు పెట్టి ట్యూషన్‌కు పంపించలేరు. టీచర్లను పెట్టి చదివించుకోలేరు. అన్ని విధాలా పేదల పిల్లలు ఇంగ్లీషు మాధ్యమంలో నష్టపోవడం ఖాయం. డబున్న వాళ్లకు అన్ని అవకాశాలు వుంటాయి గనుక ఏ మాధ్యమ మైనా ఫర్వాలేదు. ముందుగా ప్రతి ఒక్కరికి చదువు అన్నది నినాదంగా..దేశంలో జాతీయోద్యమంగా సాగాలి.

# సమర్థవంతంగా బాలల హక్కుల పరిరక్షణ : మంత్రి సత్యవతి




హైదరాబాద్, జనవరి 7: బాలల హక్కుల పరిరక్షణలో అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని, బాలల హక్కులను ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు పడేలా చూడాలని రాష్ట్ర మహిళాభివృద్ధి-శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నూతన కార్యాలయాన్ని గురువారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కమిషనరేట్ పరిధిలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలల హక్కులపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కల్పించాలన్నారు. తెలిసి, తెలియని వయసు నుంచే బాలబాలికల పట్ల అనేక దురాఘతాలు జరుగుతున్నాయన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ జే. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటికే తాము బాలల హక్కులను కాపాడడంలో చాలా చురుకుగా పనిచేసినట్లు తెలిపారు. ఎక్కడ బాలల హక్కులు ఉల్లంఘనకు గురి అయినా అక్కడకు కమిషన్ చేరుకుని బాధితుల పక్షానా నిలబడుతోందన్నారు. రాబోయే కాలంలో ఇంకా మరింత సమర్థవంతంగా పనిచేస్తామన్నారు. బాలల హక్కులపై గ్రామాల్లో కూడా అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.కార్యక్రమ అనంతరం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కమిషనరేట్‌లో రసాయనాలు లేకుండా పండించే ఆకుకూరలు, కూరగాయల విత్తనాలను మంత్రి, కమిషన్ సభ్యులు, అధికారులు చల్లారు. పలు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు బృందాదర్, అంజన్ రావు, దేవయ్య, శోభారాణి, అపర్ణ, రాగజ్యోతి, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కమిషనర్, ప్రత్యేక కార్యదర్శి దివ్య, బాల నేరస్తుల శాఖ సంచాలకులు శైలజా, కమిషన్ కార్యదర్శి ఆశ్రిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి నెలాఖరులోగా గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

## -అధికారులను ఆదేశించిన కలెక్టర్



రాజన్న సిరిసిల్ల, జనవరి 7 (నేటినిజం ప్రతినిధి):అత్యాధునిక సదుపాయాలతో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచి ఫిబ్రవరి నెలాఖరులోగా నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ కృష్ణ భాస్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

గురువారం ఆయన కోనరావుపేట మండలం నాగారం గ్రామంలో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను సంబంధిత అధికారులు, గుత్తేదారులతో కలిసి పరిశీలించారు.

1 కోటీ 40 లక్షల రూపాయలతో చేపట్టిన అత్యాధునిక గ్రంథాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభం చేసి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇంకా పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతుందని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. సంబంధిత గుత్తేదారులు నాణ్యతతో పనులు చేపట్టి భవన నిర్మాణాన్ని ఈ ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అన్నారు. వీలైనంత తొందరగా నిర్మాణం పూర్తి చేయడానికి శ్రమిస్తామని సంబందిత అధికారులు గుత్తేదారులు కలెక్టర్ కు తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ గ్రంథాలయ భవన నిర్మాణం పక్కన ఉన్న జీ ఎం ఆర్ వరలక్ష్మి ఉపాధి శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజనా లో భాగంగా నిరుద్యోగ యువతకు ఎలక్ట్రికల్, ఆటో మొబైల్, సోలార్ ట్రైనింగ్, హోం హెల్త్ ఎయిడ్ కోర్సులలో యువతీ, యువకులకు శిక్షణ ఇచ్చి విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం హర్షణీయం అన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే యంత్రాంగాన్ని సంప్రదించాలని అన్నారు. ఈ సందర్శనలో సంబంధిత అధికారులు, గుత్తేదారులు, తదితరులు పాల్గొన్నారు.

# జీవన్‌దాన్ కింద అవయవాల దానం

హైదరాబాద్,జనవరి6(ఆర్ఎన్ఎ): భోగోజు వెంకట స్వామి(67) అనే వృద్ధుడిని వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. దీంతో బంధువులు ఇతడి అవయవాలను జీవన్‌దాన్ ఆర్గాన్ డోనేషన్‌కు దానం చేసేందుకు సమ్మతి తెలిపారు. ఉప్పర్‌పల్లిలోని వెంకటేశ్వర ఎన్‌క్లేవ్ నివాసి వెంకటస్వామి ఈ నెల 4వ తేదీన ఇంట్లో తలతిరగడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అదేరోజు మెరుగైన చికిత్స కోసం సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తరలించారు. పలు వైద్య చికిత్స అనంతరం న్యూరో ఫిజిషియన్స్ స్పందిస్తూ.. బ్రెయిన్‌లో ఇంటర్నల్ బ్లీడింగ్ కారణంగా బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు.

# అక్రమ మైనింగ్‌ను ఆపండి

## సిఎస్‌కు ఎంపి ధర్మపురి అర్వింద్ లేఖ

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలని, వెంటనే ఆపాలని సీఎస్ సోమేష్‌కుమార్‌కు ఎంపీ ధర్మపురి అర్వింద్ లేఖ రాశారు. రాష్ట్రంలో అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్న.. వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర మైనింగ్ శాఖ ఇచ్చిన ఆదేశాలను కూడా పట్టించుకోవడం లేదన్నారు. అక్రమాలకు పాల్పడిన వ్యాపారులపై చర్యలు తీసుకోకపోగా... తిరిగి వారికే కొత్తగా మైనింగ్ కోసం భూములు కేటాయించడం సరికాదని అర్వింద్ లేఖలో పేర్కొన్నారు. మైనింగ్ వ్యాపారుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయన్నారు. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అర్వింద్ లేఖలో తెలిపారు.

# టీఆర్ఎస్‌ను నమ్ముకున్న వారికి న్యాయం

## పార్టీలో చేరిన వారిని ఆహ్వానించిన మంత్రి శ్రీనివాసగౌడ్

మహబూబ్‌నగర్,జనవరి7(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఊరు ఊరంతా కదిలిందని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హన్వాడ మండలం బుద్దారం గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా నేత సుధాకర్ రెడ్డి సహా సుమారు 500 మంది బీజేపీ నుంచి టీఆర్ఎస్‌లో చేరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అభివృద్ధిని చూసి బుద్దారం గ్రామం కదిలివచ్చిందని ఆయన అన్నారు.

బుధవారం జిల్లా కేంద్రంలోని టీఆర్ఎస్ కార్యాలయంలో చేరికల కార్యక్రమం జరిగింది.

గత 25 ఏండ్లుగా గ్రామస్తుల ప్రధాన సమస్య అయిన బ్రిడ్జి నిర్మాణాన్ని గతంలో ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఇటీవలే బ్రిడ్జి నిర్మించి గ్రామస్తుల సమస్యను పరిష్కరించామని మంత్రి తెలిపారు. టీఆర్ఎస్‌ని నమ్ముకున్న వారికి, పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి ఎప్పటికైనా తగిన గుర్తింపు, న్యాయం జరుగుతుందన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలో ముంపునకు గురికాకుండా బుద్దారం గ్రామాన్ని కాపాడామనే కృతజ్ఞత గ్రామస్తుల్లో కనబడుతోందని ఆయన తెలిపారు. పార్టీని, తమను నమ్ముకున్న వారికి అర్ధరాత్రి కష్టమొచ్చినా వెంటనే అక్కడ ప్రత్యక్షమై వారికి సాయం అందిస్తామన్నారు.

హాకీ క్రీడాకారుడు ప్రవీణ్ రావు సహా అతని సోదరులను కిడ్నాప్ చేసినట్లు సమాచారం రాగానే ఘటనా స్థలికి వెళ్లినట్లు మంత్రి తెలిపారు.

ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో రాయలసీమ గుండాయిజం నడవదని మంత్రి హెచ్చరించారు.

ఈ ఘటనలో ఎంతటి స్థాయి వ్యక్తులున్నా వారిని పట్టుకుని లోపలేస్తామన్నారు.

బీజేపీ నాయకులు శాంతయ్య, శేఖర్, కేశవులు, రాజు, వెంకటయ్య, నర్సింహులుతో సహా సుమారు 500 మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొరమోని నర్సింహులు, టీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

# 2022 ఖరీఫ్ లక్ష్యం

## వడివడిగా పోలవరం పనులు


## పోలవరం ప్రాజెక్టు పనుల్లో కీలక ఘట్టం

## స్పిల్ ఛానెల్‌లో కాంక్రీట్ పనులు ప్రారంభం

అమరావతి,జనవరి7(ఆర్ఎన్ఎ): వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి పోలవరం ద్వారా నీరందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రాజెక్టును సందర్శించిన సమయంలో ఈ ఏడాది డిసెంబర్ నాటికి ప్రాజెక్ట్ పూర్తి చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశిరచిన సమయానికే పనులు అన్నీ సక్రమంగా పూర్తి చేసి 2022 ఖరీఫ్ నాటికి నీళ్లందిస్తామని ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణతో పనులు ఊపందుకుంటున్నాయి. ఇరిగేషన్ శాఖ కూడా అనుకున్న సమయానికి ప్రాజెక్టును పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. తాజాగా ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటికే ప్రాజెక్టులో అత్యంత కీలకమైన గేట్ల ఏర్పాటు ప్రక్రియ ఓ వైపు కొనసాగుతుండగానే మరోవైపు స్పిల్ చానెల్ లో కాంక్రీట్ పనులను అధికారులు మొదలుపెట్టారు. 2020 జూలైలో గోదావరి నదికి వచ్చిన వరదల కారణంగా స్పిల్ చానెల్ మట్టి తవ్వకం, కాంక్రీట్ పనులకు బ్రేక్ పడింది. 3టీఎంసీల నీరు ఎత్తిపోత స్పిల్ వే ఛానల్ నిర్మాణ ప్రాంతంలో దాదాపు 3 టీఎంసీలకు పైగా వరద నీరు నిలిచింది. దీంతో గతేడాది జూన్ నుంచి స్పిల్ వే ఛానల్ కాంక్రీట్, మట్టి తవ్వకం పనులు నిలిచిపోయాయి. ప్రాజెక్ట్ నిర్మిస్తున్న మేఘా ఇంజనీరింగ్ సంస్థ గత ఏడాది నవంబర్ నుంచి 70 భారీ పంపు సాయంతో నీటిని తోడి పోసింది. ఇప్పటివరకు 2.5 టీఎంసీల నీటిని గోదావరిలో తోడిపోసినట్లు మేఘా ఇంజనీరింగ్ నిపుణులు తెలిపారు. నీటి తవ్వకం దాదాపు పూర్తికావడంతో మట్టితవ్వకం, అంతర్గత రహదారుల నిర్మాణ పనులను మొదలుపెట్టారు. ఇప్పటివరకు 1,10,033 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తికాగా.. స్పిల్ ఛానెల్ లో 10,64,417 క్యూబిక్ మీటర్ల మట్టితవ్వకం పనులు పూర్తయ్యాయి. మిగిలిన మట్టి తవ్వకం, కాంక్రీట్ పనులను ఈ ఏడాది జూన్ లోగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ప్రాజెక్టు స్పిల్ ఛానల్ వద్ద ప్రత్యేక పూజలు చేసి కాంక్రీట్ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖకు చెందిన పద్మకుమార్, దామోదరం, మేఘా ఇంజనీరింగ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ మత్తి అలగన్, అసిస్టెంట్ మేనేజర్ పి.చంద్ర మోహన్, సీనియర్ ఇంజినీర్ వై.అంకమ్మరావు పాల్గొన్నారు. మరోవైపు ప్రాజెక్టు గేట్ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. స్పిల్ వే పిల్లర్ల నిర్మాణం 55 మీటర్ల ఎత్తుకు చేరుకోవడంతో డిసెంబర్ 18న గేట్ల ఏర్పాటు పనులను ప్రారంభించారు. ప్రపంచంలోనే పెద్దవైన ఆర్మ్ గడ్డర్లను పోలవరం ప్రాజెక్టు గేట్లకు ఉపయోగిస్తున్నారు. ప్రాజెక్టుకు ఏర్పాటు చేస్తున్న ఒక్కో గేటు బరువు 300 టన్నులు ఉంటుంది. మొత్తం గేట్లకు 18వేల టన్ను స్టీల్ ను వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు గేట్లు పైకి ఎత్తడానికి, కిందకి దించడానికి, వరదనీటిని విడుదల చేయడానికి హైడ్రాలిక్ పద్ధతని వినియోగిస్తున్నారు. గేట్ల ఏర్పాటుకు అవసరమైన 98 సిలిండర్లను జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్నారు.

# కొవిడ్ వ్యాక్సిన్‌పై అవగాహన

## అరుణ, విద్యాశాఖ అధికారులు టైటాన్ లో పాల్గొన్నారు



రాజన్న సిరిసిల్ల, జనవరి 7 (నేటినిజం ప్రతినిధి):కొవిడ్ వ్యాక్సిన్ పంపిణీపై గురువారం చందుర్తి తాసిల్దార్ కార్యాలయంలో వైద్య సిబ్బంది మండల స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు, ప్రభుత్వం కరోనా మహమ్మారిని తరిమికొట్టాలని ఉద్దేశంతో వ్యాక్సిన్ తయారుచేయగా దీని వినియోగం పై చందుర్తి ప్రభుత్వ వైద్యాధికారి మసూద్ అహ్మద్ ప్రభుత్వ అధికారులకు అవగాహన కల్పించారు, శుక్రవారం మళ్లీ జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్ రావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు, ఈ కార్యక్రమంలో చందుర్తి తాసిల్దార్ నరేష్, రుద్రంగి తాసిల్దార్ తఫజుల్లా హుస్సేన్, ఎంపీడీవోలు రవీందర్రావు, శంకర్, ఐసిడిఎస్ సిడిపిఓ ఎల్లయ్య గౌడ్, సూపర్వైజర్

# మనకు బర్డ్‌ఫ్లూ భయం లేదు

## ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాం

## ప్రజలు ఆందోళనకు గురికావద్దు: తలసాని

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ ఆనవాళు ్ళ లేవని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. అయితే ముందస్తు చర్యలు తీసుకున్నామని అన్నారు.

బుధవారం తన కార్యాలయంలో బర్డ్ ఫ్లూ వ్యాధికి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పక్షులకు సోకే ఈ వ్యాధిని ప్రస్తుతం దేశంలోని రాజస్థాన్, మధ్యప్రదేశ్, కేరళ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో మాత్రమే గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వ అధికారులు ప్రకటించారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యల వలన మన రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ ఆనవాళ్ళు లేవని అన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 1300 రాపిడ్ రెస్పాన్స్ బృందాలు నిరంతర పర్యవేక్షణ జరుపుతూ బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రభల కుండా అనేక చర్యలు తీసుకుంటుందని వివరించారు. రాష్ట్రంలోని కోళ్ళ నుండి 276 శాంపిల్స్ ను సేకరించి పరీక్షించడం జరిగిందని తెలిపారు. అన్ని స్థాయిలలోని అధికారులను ఇప్పటికే అప్రమత్తం చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ వ్యాధి ప్రధానంగా పక్షులు, కోళ్ళకు వ్యాపించే అవకాశం ఉందని, దేశంలో మన రాష్ట్రం కోళ్ళ పరిశ్రమ అభివృద్ధిలో 3 వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. కోళ్ళ పరిశ్రమల నిర్వాహకులను కూడా పశు సంవర్ధక శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పలు సూచనలు, ఆరోగ్య శిభిరాలను నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే వలస పక్షుల వలన కొంత మేరకు ఈ వ్యాధి కొన్ని ప్రాంతాలలో మాత్రమే ప్రభలే అవకాశం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, అడిషనల్ డైరెక్టర్ రాంచందర్, స్నేహ ఫార్మ్స్ ప్రతినిధి గోపాల్ రెడ్డి, ఎన్ఈసిసి ప్రతినిధులు కుమార్, సందీప్ చింతా ర్వార్, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న క్షేత్రంలో నేడు రెడ్డి భవనం ప్రారంభం



రాజన్న సిరిసిల్ల, జనవరి 7 (నేటినిజం ప్రతినిధి): అఖిలభారత రెడ్డి సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో వేములవాడ లో నిర్మించిన రెడ్డి సంఘం భవనాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు తోడేటి నరసింహారెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు వసతి కల్పించేందుకు వేములవాడ శివారులోని నందికమాన్ చౌరస్తాలో వసతి గదుల సముదాయాన్ని నిర్మించినట్లు ఆయన తెలిపారు. దేశంలోని పలు పుణ్యక్షేత్రాల సమీపంలో భక్తుల సౌకర్యార్థం వసతి గదులను నిర్మిస్తున్నట్లు ఇందులోభాగంగా వేములవాడ లో మెరుగైన సౌకర్యాలు కలిగిన వసతి గృహాలు నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు.రాజన్న ఆలయదర్శనానికి వచ్చే భక్తులు వసతి గదులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com